


visit us @ http://epaper.suryaa.com

# నేటి దినపత్రిక సూర్య

www.suryaa.com


విద్యార్థులకు దిశా నిర్దేశం..నిరుద్యోగులకు మార్గనిర్దేశకం...



APPSC,TSPSC
పోటీపరీక్షల గైడెన్స్
నిపుణులైన అధ్యాపకులతో నాణ్యమైన మెటీరియల్
కరెంట్ అఫైర్స్
నమూనా ప్రశ్నాపత్రాలు
విద్యా ఉద్యోగ సమాచారం
'సూర్య' ఆన్‌లైన్‌ఎడిషన్
www.suryaepaper.com
చూడండి.



సంపుటి 18 | సంచిక 151

ఆదివారం | 23 మార్చి 2025 | విజయవాడ | పేజీలు 8+8 | వెల: రూ. 8.00

Published from Hyderabad, Visakhapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Kadapa, Kurnool, Anantapuram, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bangalore, Mumbai, New Delhi


అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయణం - హేమంత ఋతువు, ఫాల్గుణమాసం బహుళ. నవమి రా.1.06, పూర్వాషాఢ రా.12.07, వర్జ్యం ఉ.9.25 నుంచి 11.03 వరకు
రాహుకాలం సా.4.30 నుంచి 6.00 వరకు దుర్ముహూర్తం సా.4.25 నుంచి 5.13 వరకు

# ఆరంభం అదిరింది




ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 సీజన్ శనివారం రాత్రి కోల్‌కత్తాలోని ఐకానిక్ ఈడెన్ గార్డెన్స్‌లో ప్రారంభమైంది. సినీ ప్రముఖులు శ్రేయా ఘోషల్, కరణ్ ఔజ్లా, దిశా పటానీ వంటి స్టార్స్ మూడ్ సెట్ చేయడంతో ప్రారంభ వేడుక గ్రాండ్‌గా జరిగింది. కోల్‌కతాలో మెగా టోర్నమెంట్ స్టైల్‌గా ప్రారంభమైనందున అభిమానులు సంగీతం, వినోదం మరియు క్రికెట్ యొక్క గొప్ప మిశ్రమాన్ని ఆహుతులు, ప్రేక్షకులు ఆస్వాదించారు.. కోల్‌కతా నైట్ రైడర్స్ మరియు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య సీజన్ ఓపెనింగ్ మ్యాచ్‌లో వర్షం కురుస్తుందని వాతావరణ నివేదిక ఉన్నప్పటికీ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసినా ప్రేక్షకులు మాత్రం భారీ ఎత్తున ఈ ఆరంభ వేడుకలకు హాజరయ్యారు....

7 లో

సూర్య వెబ్‌సైట్

సూర్య ఈ - పేపర్

## జల సంరక్షణతోనే దేశ
# సుస్థిర అభివృద్ధి

- ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ
- ఈ ఏడాది థీమ్ 'గ్లేసియర్ ప్రిజర్వేషన్' పాటిద్దాం
- ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ప్రభావితం చేస్తున్న తీవ్ర నీటి సంక్షోభం
- హిమానీనదాల కీలక పాత్ర వాతావరణ మార్పులపైనా చర్చ జరగాలి



6 లో

నీటిని సంరక్షించడం ద్వారనే దేశం సుస్థిర అభివృద్ధి సాధిస్తుందని మోడీ తెలిపారు. వుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటిని సంరక్షించడం అంటే సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడమేనని ఇందులో మన దేశం నిబద్ధత వెరెవ్వరూ ఎత్తి చూపలేరని ప్రధాని మోడీ పునరుద్ఘాటించారు.

## నిధుల విడుదలపై కేంద్రం
# సకాలంలో స్పందించాలి

- ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి
- ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో శాఖ స్థితిగతులపై చర్చ
- తూర్పు గోదావరి జిల్లా అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన ఘటనపై ఆగ్రహం
- తక్షణం నిందితులను అరెస్టు చేయాలని డిజిపికి ఆదేశాలు
- ఆర్థిక శాఖపై సీఎం బాబు సమీక్ష

రాష్ట్ర ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో, ఆర్థిక శాఖలో నెలకొన్న పరిస్థితులపై ఆయన చర్చించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్రం నుంచి రావలసిన నిధులపై అధికారులతో సమీక్షించారు. కేంద్రంలోని వివిధ శాఖల నుంచి రావలసిన నిధులు సత్వరం పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.



2 లో

## మన బలం తగ్గే
# ప్రమాదం

డీలిమిటేషన్‌పై స్టాలిన్ హెచ్చరిక



6 లో

## ట్రంప్ 'గోల్డ్ కార్డ్'కు
# ఫుల్ డిమాండ్



వివరాలు-6లో

## అంతా ఇంతే!




ఇదే మంచి సమయం రోజూ ఎర్త్ అవర్ ఉంటే బాగుండు

## విజయవాడలో రెండు రోజుల
# ట్రావెల్ ఎగ్జిబిషన్



- ట్రావెల్, టూరిజం, రైల్వేలు, హాస్పిటాలిటీ కోసం ప్రత్యేకం
- దేశీయ, అంతర్జాతీయ పర్యాటక ప్రోత్సాహమే లక్ష్యం
- మీ సెలవుల కోసం అత్యుత్తమ గమ్యస్థానాలు
- ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రావెల్ ఎగ్జిబిషన్ డైరెక్టర్ అనురాగ్ గుప్తా

వివరాలు-2లో

## ఆర్థిక స్థిరత్వమే
# కూటమి లక్ష్యం

- రాష్ట్ర అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం
- ఉపాధి హామీ పనులతో అన్నదాతల కళ్లలో వెలుగు చూడాలి
- కర్నూలు జిల్లా, పుడిచర్లలో ఫామ్ పాండ్స్ నిర్మాణానికి భూమి పూజ చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్

రాష్ట్ర అభివృాఎద్ధికి సమగ్ర ప్రణాళికతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మా ప్రభుత్వంలో వ్యవస్థలను పటిష్ట పరుచు కుంటూ ముందుకు వెళ్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృాఎద్ధి శాఖమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు.



2 లో

## ధాన్యం కొనుగోళ్లలో చారిత్రాత్మక
# మైలురాయి చేరాం

- రూ.8003 కోట్ల మేర ధాన్యం కొనుగోలు చేయడం ఓ రికార్డు
- వైసీపీ పాలన చీకటి రోజుల నుంచి అన్నదాతను బయటకు తెస్తున్నాం
- ఖరీఫ్ స్ఫూర్తితో రబీ సీజన్ ధాన్యం కొనుగోలుకు సిద్ధం
- తేమ శాతం సమస్యలు, తూకం సమస్యలు, గోతాముల కొరత, రవాణా ఇబ్బందులు లేకుండా చూస్తాం
- ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్

ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో కూటమి ప్రభుత్వం ఓ చారిత్రాత్మక మైలురాయికి చేరింది.



## ప్రసూతి మరణాలను తగ్గించడంలో
# ప్రగతిని సాధించాం

- సురక్షిత ప్రసవాల కోసం వైద్య సౌకర్యాల్ని బలోపేతం చేస్తున్నాం
- 2030 నాటికి ప్రసూతి మరణాల రేటును 70 కన్నా తక్కువ సాధించాలన్నదే లక్ష్యం
- సామాజిక మాధ్యమంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ట్వీట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు కార్యక్రమాల ద్వారా ఏపీలో ప్రసూతి మరణాలను తగ్గించటంలో గణనీయమైన ప్రగతి సాధించగలిగామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ సామాజిక మాధ్యమం ఎక్స్ లో ట్వీట్ చేశారు.



2 లో




## నగర ప్రజలతోపాటు ఆటోనగర్ కార్మికులకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ రోడ్లు ఏర్పాటు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి: కొద్ది రోజుల్లో మహానాడు రోడ్డు నుంచి నిడమానూరు వరకు ఫ్లైఓవర్ తో పాటు, తొలిదశలో గన్నవరం నుంచి మెట్రో కారిడార్ పనులు ప్రారంభం కానున్న నేపథ్యంలో విజయవాడలో ట్రాఫిక్ సమస్య మరింతగా పెరుగుతుంది. అలాగే ఆటోనగర్ లోకి లారీలు రావటం కష్టంగా మారుతుంది. అందుకని ఫ్లైఓవర్, మెట్రో కారిడార్ పనులు పూర్తి అయ్యే వరకు ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారించింది. సీఆర్డీఏ పరిధిలోని రోడ్లను అవసరమైనా వాటిని విస్తరించి, ప్రత్యామ్నాయ రోడ్లను అభివృద్ధి చేసి త్వరగా అందుబాటులోకి తెచ్చేందుకు కృషి చేస్తున్నట్లు విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ తెలిపారు. నగరంలో ఫ్లైఓవర్, మెట్రో పనులు ప్రారంభమైతే ఆటోనగర్ లోకి లారీలు రావటం కష్టంగా మారుతుంది. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని, 305 ఎకరాల్లో లక్షమంది జీవనం సాగిస్తున్న ఆటోనగర్ కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా నగర శివార్లలోని కన్వెంట్ రోడ్డును డెవలప్ చేసి అందుబాటులో తెచ్చేందుకు ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు కృషి చేస్తున్నారు. ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ఆధ్వర్యంలో సీఆర్డీఏ పరిధిలో వున్న రోడ్లను ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తో కలిసి సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబు శనివారం పరిశీలించారు. ఆటోనగర్ లోని బల్లెం వారి వీధి, మహానాడు రోడ్, శక్తి కళ్యాణ మండపం రోడ్డు, ఘంటసాల రోడ్డు పరిశీలించారు. ఆ ప్రాంతాల్లో పర్యటించి చేపట్టాల్సిన రహదారుల అభివృద్ధి పనులతో పాటు లింక్ రోడ్లను పరిశీలించారు. ఈ రహదారుల్లోకి లారీలు అనుమతి ఇస్తే ట్రాఫిక్ కి ఎలాంటి ఇబ్బంది లేకుండా వుంటుందనుకున్నారు. అలాగే గన్నవరం వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గం రామవరప్పాడు నుంచి ఎస్.ఎస్.వి (గ్రాండ్ మీదు) కేసరపల్లి కి వెళ్లే రహదారిని పరిశీలించారు. అలాగే ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావు సీఆర్డీఏ పరిధిలో ఏర్పాటు చేయాల్సిన రోడ్లు, అభివృద్ధి చేయాల్సిన మార్గాలు సీఆర్డీఏ కమిషనర్ కన్నబాబుకి చూపించారు.

# కేంద్రం నుంచి నిధులు సకాలంలో తెచ్చుకోవాలి

**● ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి ● ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో శాఖ స్థితిగతులపై చర్చ ● తూర్పుగోదావరి జిల్లా అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన ఘటనపై ఆగ్రహం ● తక్షణం నిందితులను అరెస్టు చేయాలని డిజిపికి ఆదేశాలు ● ఆర్థిక శాఖపై సీఎం బాబు సమీక్ష**



అమరావతి: రాష్ట్ర ఆర్థిక శాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో, ఆర్థిక శాఖలో నెలకొన్న పరిస్థితులపై ఆయన చర్చించారు. కేంద్ర ప్రాయోజిత పథకాలు, కేంద్రం నుంచి రావలసిన నిధులపై అధికారులతో సమీక్షించారు. కేంద్రంలోని వివిధ శాఖల నుంచి రావలసిన నిధులు సత్వరం పొందేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.కేంద్ర పథకాలకు సంబంధించి అవసరమైన సమగ్ర సమాచారాన్ని అందించి, నిధులు సకాలంలో విడుదల అయ్యేలా చూడాలని ముఖ్యమంత్రి అధికారులకు సూచించారు.కేంద్ర పథకాలకు సంబంధించి ఐదు శాఖల నిధులు రావాల్సి ఉందని అధికారులు తెలియజేశారు.కేంద్రంతో సంప్రదింపులు జరిపి, ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా కేంద్ర పథకాలకు సంబంధించి 5 శాఖల నుంచి నిధులు రావాల్సి ఉందని ఈ సందర్భంగా అధికారులు సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఆర్థిక సంవత్సరం ముగిసేలోగా రాష్ట్రానికి నిధులు తెచ్చుకోవాలన్నారు. ముఖ్యమంత్రి నివాసంలో జరిగిన ఈ సమీక్షకు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, ఆర్థిక శాఖ సెక్రటరీ రోనాల్డ్ రోస్ హాజరయ్యారు. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, సీఎంవో అధికారులు పాల్గొన్నారు. మరోవైపు తూర్పు గోదావరి జిల్లాలోని నల్లజర్ల మండలంలో గల దూబచర్లగాంధీ కాలనీలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన ఘటనను ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఖండించారు. ఈ ఘటనపై ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాతో ఇవాళ(శనివారం) రాష్ట్ర సచివాలయంలో సమీక్ష చేశారు. నిందితులపై కఠిన చర్యలకు ఆదేశించారు. భారతరత్న అంబేద్కర్‌ను అగౌరవపరిచేలా విగ్రహం పట్ల దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీకి సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. ఈ ఘటనపై డీజీపీ, పోలీస్ ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడారు. ఈ ఘటనపై పూర్తి వివరాలను సీఎం చంద్రబాబుకు డీజీపీ తెలిపారు. ఈ ఘటనలో కుట్ర కోణాన్ని వెలికి తీయాల్సిందిగా డీజీపీని ఆదేశించారు. దీనిపై దర్యాప్తు ప్రారంభించినట్లు సీఎంకు డీజీపీ తెలిపారు. నిందితులను గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసినట్లు సీఎంకు వివరించారు. వర్గాల మధ్య విద్వేషాలు రగిల్చేలా కుట్ర చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ప్రయత్నం చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని సీఎం చంద్రబాబు హెచ్చరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సీఎం చంద్రబాబు కోరారు. పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టే వారిపై నిఘా ఉంచాలని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారు.

## మంత్రి ఫరూక్‌కు సీఎం చంద్రబాబు పరామర్శ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : హైదరాబాద్, మార్చి 22 :- ఏపీ మైనారిటీ సంక్షేమ శాఖామంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారు. హైదరాబాద్ లో శనివారం సీఎం చంద్రబాబు ఫరూక్ ఇంటికెళ్లారు. ఇటీవల ఫరూక్ సతీమణి మెహనాజ్ అనారోగ్యంతో మృతిచెందారు. ఈ నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి ఫరూక్, కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పరామర్శించిన వారిలో టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు ఉన్నారు.

## క్రీడాకారులు మరిన్ని పతకాలు సాధించాలి



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఢిల్లీలో జరుగుతున్న ఖేలోఇండియా పారా గేమ్స్ 2025 లో అత్యున్నత ప్రతిభ ప్రదర్శించి పతకాలు సాధించిన ఆంధ్ర ప్రదేశ్ క్రీడాకారులకు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అభినందనలు తెలియజేశారు. నిరంతర కృషి, పట్టుదలతో విజయాలు సాధించిన మీరు ఆంధ్ర ప్రదేశ్ కు గర్వకారణమని కొనియాడారు. క్రీడల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తున్న నేపథ్యంలో ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని మరింత శ్రమించి భవిష్యత్తులో విజయపరంపర కొనసాగించాలని అభిలషిస్తున్నాను. యువతకు ప్రత్యేకించి క్రీడాకారులకు మీ విజయాలు ఎంతో స్ఫూర్తిదాయకం. అదే భావనతో భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని ఆయన అభిలషించారు,

# బడ్జెట్ సమావేశాల్లో ప్రజలకు మరింత చేరువైన కూటమి ప్రభుత్వం

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : బడ్జెట్ సమావేశాలు తెలుగుదేశం ప్రభుత్వానికి మరింత బలాన్ని చేకూర్చి పెట్టాయి. సీట్లు తక్కువ వచ్చినా ప్రతిపక్ష హోదా కావాలని మొండికేసిన వైసీపీ అధినేతకు ఈ సమావేశాలు మరింత ప్రతిష్టను దిగజార్చాయి. హోదా ఇస్తేనే మా సమస్యల కోసం గొంతెత్తుతారా అని ప్రజలు ముఖ్యంగా పార్టీకి ఓటు వేసిన ప్రజలు, అభిమానులు ప్రశ్నిస్తున్నారు. ఏది ఏమైనా ఈ సమావేశాల వలన వైసీపీ మరింత బలహీన పడిందని చెప్పక తప్పదు. ఒక మండలిలోనే ప్రజా సమస్యలపై వైసీపీ పోరాట పటిమను ప్రదర్శించింది. దీనికి ధీటుగా టీడీపీ మంత్రులంతా మండలిలోనే ఎక్కువ సమయం కేటాయించారు. కొసమెరుపుగా మునుపెన్నూడూ లేని రీతిలో శాసన సభ్యుల సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి. అక్కడా టీడీపీ వైసీపీ అధినేతను వదలి పెట్టలేదు. తమ సాంస్కృతిక కార్యక్రమాల్లో అధినేతపై విమర్శలు. శాసనసభలో ఏకపక్షం, శాసన మండలిలో విపక్షం ప్రతిఘటన ఇవీ పక్షం రోజులపాటు నిర్వహించిన ఎపి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో కనిపించిన సన్నివేశాలు. గత వైసిపి ప్రభుత్వానికి భిన్నంగా, అంతకుముందుకు మల్లే వీలైనన్ని ఎక్కువ రోజులు సమావేశాలు నిర్వహిస్తామన్న టిడిపి కూటమి ప్రభుత్వం, ముందుగా నిర్ణయించిన దానికంటే ఒక రోజు ముందే ముగించింది. ఫిబ్రవరి 24న రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ప్రసంగంతో బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాగా గురువారం మధ్యాహ్నం ఉభయ సభలూ నిరవధికంగా వాయిదా పడ్డాయి. సెలవులు పోను మార్చి 21 వరకు 17 రోజులపాటు సమావేశాలు నిర్వహించాలని సభా వ్యవహారాల సలహా కమిటీ (బిఎసి)లో తొలుత నిర్ణయించారు. అంతకంటే ఒక రోజు ముందు మార్చి 20న ముగించారు. గవర్నర్ ప్రసంగం రోజును మినహాయిస్తే శాసనసభ 15 రోజులే జరిగింది. మండలి మధ్యలో ఒక రోజు సమావేశం కాలేదు. అందువల్ల మండలి 14 రోజులే భేటీ అయింది. సమావేశాల తొలి రోజు గవర్నర్ ప్రసంగానికి వైసిపి ఫ్లోర్ లీడర్ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలు, ఎంఎల్‌సిలు హాజరై శాసనసభలో వైసిపికి ప్రతిపక్ష హోదా ఇవ్వాలని నిరసన తెలిపి వాకౌట్ చేశారు. తతిమ్మా అన్ని రోజులూ సభకు దూరంగా ఉన్నారు. దాంతో శాసనసభలో ప్రతిపక్షం లేకుండా పోయింది. సభలో చర్చలన్నీ ముఖ్యమంత్రి, కూటమి మంత్రులు, ఎంఎల్‌ఎల స్వోత్కర్ష, ఆత్మస్తుతి, పరనిందలకు పరిమితమయ్యాయి. ఏ అంశం చర్చకొచ్చినా సిఎం, మంత్రులు స్వర్ణాంధ్ర 2047, పి-4లను వల్లె వేశారు. కాగా వైసిపికి ప్రతిపక్ష హోదాపై స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు రూలింగ్ ఇచ్చారు. వైసిపి సభ్యులు సభకు హాజరు కాకుండా దొంగల మాదిరి సంత కాలు పెట్టారని సమావేశాల చివరి రోజున పేర్కొన్నారు. ఇదిలా ఉండగా, సభకు వైసిపి హాజరు కాకపోవడం వలన ప్రభుత్వ వైఫల్యాలను, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలుపై నిలదీసే, విపక్ష పాత్ర పోషించే అవకాశాన్ని ఆ పార్టీ జారవి డుకొని విమర్శల పాలైంది. ఈ పరిస్థితిని అధికారపక్షం చాకచ క్యంగా తనకు అనుకూలంగా మార్చుకుంది. కాగా కొన్నేళ్లల్లో ఈ సారి ఎక్కువ రోజులు అసెంబ్లీ భేటీ కావడం, ప్రశ్నోత్తరాలు, లఘు చర్చలు, 344, సావధాన తీర్మానం, జీరో అవర్ వంటివి నిర్వహించడం సానుకూలాంశం.

## అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన ఘటనను ఖండించిన సీఎం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : తూర్పు గోదావరి జిల్లా, గోపాలపురం నియోజకవర్గం, నల్లజర్ల మండలం, దూబచర్లగాంధీ కాలనీలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన ఘటనను సీఎం చంద్రబాబు నాయుడు ఖండించారు. భారతరత్న అంబేద్కర్‌ను అగౌరవపరిచేలా విగ్రహం పట్ల దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై డీజీపీ, పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి...కుట్రతో ఇటువంటి నేరాలకు పాల్పడతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు, ఆయా వర్గాల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించేవారిపట్ల అత్యంత కఠిన వ్యవహరించి, ఇటవుంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేవారిపై నిఘా ఉంచాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# ప్రజలకు ఆర్థిక స్థిరత్వమే కూటమి లక్ష్యం

**● రాష్ట్ర అభివృద్ధిపై సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్తున్నాం ● ఉపాధి హామీ పనులతో అన్నదాతల కళ్లలో వెలుగు చూడాలి ● గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా నిర్వీర్యం చేసింది ● కూటమి ప్రభుత్వం వ్యవస్థలను పటిష్టపరుస్తూ ముందుకు వెళ్తోంది ● త్వరలో జిల్లాల్లో పర్యటనకు ప్రణాళికలు ● కొణిదెల గ్రామంలో అభివృద్ధి పనులకు సొంత ట్రస్ట్ నుంచి రూ. 50 లక్షల నిధులు ● కర్నూలు జిల్లా, పుడిచర్లలో ఫామ్ పాండ్స్ నిర్మాణానికి భూమి పూజ చేసిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్**



ఏపీ, స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్ర అభివృద్ధికి సమగ్ర ప్రణాళికతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తోంది. మా ప్రభుత్వంలో వ్యవస్థలను పటిష్ట పరుచుకుంటూ ముందుకు వెళ్తున్నామని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గత ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తే.. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో ప్రజలకు ఉపాధి కల్పించే దిశగా ఉపాధి హామీ పనులు ముందుకు తీసుకువెళ్తున్నా మన్నారు. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. అనుభవజ్ఞులైన ముఖ్యమంత్రి ఉండబట్టే పల్లె పండుగ విజయవంతం అయ్యిందన్నారు. గ్రామాల్లో అభివృద్ధి అంటే రైతన్న బలపడాలి. ఉపాధి హామీ పనులతో అన్నదాతల జీవితాల్లో కొత్త వెలుగులు రావాలి. అదే కూటమి ప్రభుత్వ ఆశయం అన్నారు. త్వరలో నియోజకవర్గానికి రెండు రోజులు పర్యటించి సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేస్తామన్నారు. కొణిదెల గ్రామ అభివృద్ధి కోసం సొంత ట్రస్ట్ నుంచి రూ. 50 లక్షలు ప్రకటించారు.



శనివారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు మండలం, పుడిచెర్లలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయ భూముల్లో సేద్యపు నీటి కుంటల(ఫామ్ పాండ్స్) నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల ఫామ్ పాండ్స్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాణ్యం ఎమ్మెల్యే శ్రీమతి గౌరు చరితారెడ్డి అధ్యక్ష్యతన నిర్వహించిన బహిరంగ సభను ఉద్దేశించి శ్రీ పవన్ కళ్యాణ్ గారు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జాతీయ ఉపాధి హామీ పథకాన్ని రాజకీయ ఉపాధి పథకంగా మార్చారు. అలాంటి వాటిని ఎదుర్కోవడానికి బలమైన అధికారులను ఏర్పాటు చేశాం. పల్లె పండుగ పనుల్లో కర్నూలు జిల్లా మొదటి స్థానంలో ఉంది. కర్నూలు జిల్లాలో రూ.75 కోట్లతో 117 కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మించాం. జాతీయ ఉపాధి హామీ పథకంలో భాగంగా జిల్లాలో 98 శాతం రోడ్ల నిర్మాణం పూర్తయ్యింది. రైతులు నీరు నిలవ చేసుకోగలిగితే సమస్య ఉండదు. వర్షాలు రాగానే పంట కుంటలు నిండేలా ప్రణాళికలు చేస్తాం. గత ప్రభుత్వంలో గ్రామ పంచాయతీలను పటిష్టపరచిన పాపాన పోలేదు. వాటిని పూర్తిగా నిర్వీర్యం చేశారు. కూటమి ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ కింద సొంత గ్రామాల్లోనే పనులు కల్పించాం. ఉపాధి హామీ కింద ఇప్పటి వరకు రూ. 9,597 కోట్లు ఖర్చు చేశాం. ప్రజలకు ఉపాధి, ఆర్థిక స్థిరత్వం కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ లక్ష్యం. ఈ రోజు జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఎకరం 30 సెంట్ల నేలలో 6 సెంట్లలో చెరువు, రెండు సెంట్లలో గట్టు ఉండే విధంగా నిర్మిస్తున్నాం. గత ప్రభుత్వంలో ఎవరు లబ్దిదా రులో కూడా తెలియనంతగా అవకతవకలకు పాల్పడ్డారు. ఈ రోజు పుడిచర్ల గ్రామానికి చెందిన రైతు శ్రీ సూర రాజన్నకు చెందిన భూమిలో ఫామ్ పాండ్ కి భూమి పూజ చేశాం. ఈ పథకం ద్వారా ఉపాధి కూలీలు లబ్ధి పొందుతున్నార. గ్రామాల్లో పనులు లేక నలిగిపోతున్నవారికి ఉపాధి కల్పించేందుకు ఈ పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది. ఈ పథకానికి కావాల్సిన అర్హత కష్టపడి పని చేయడమే.

**రాయలసీమను రతనాలసీమగా మార్చడమే కూటమి లక్ష్యం**

రాయలసీమలో నేల స్వభావాన్ని బట్టి ఇక్కడ నీటికి కటకట ఉంటుంది. వర్షం వచ్చినా నీటిని నిల్వ చేసుకునే పరిస్థితి లేదు. శ్రీ కృష్ణ దేవరాయలవారి హయాం మాదిరి రాయలసీమ రతనాలసీమ కావాలి. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యం. సీమకు పెద్ద పెద్ద ప్రాజెక్టులు వచ్చేలోపు రైతుల సౌలభ్యం కోసం ఫామ్ పాండ్స్ నిర్మిస్తున్నాం. రాష్ట్రవ్యాప్తంగా లక్షా 55 వేల పాండ్లు మే నెలాఖరు లోగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. మొత్తం పాండ్లు పూర్తయితే ఒక టీఎంసీ నీటి నిల్వకు అవకాశం ఉంటుంది. రైతులంతా బాగుండాలన్న లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పంట పొలాల్లో సేద్యపు నీటి కుంటల ఏర్పాటును ముందుకు తీసుకువెళ్తుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఒకే రోజు 13, 326 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహించాం. శ్రీ చంద్రబాబు నాయుడు గారి అనుభవాన్ని ప్రేరణగా తీసుకుని ఒకే రోజు గ్రామ సభలు నిర్వహించడంతో పాటు అభివృద్ధి పనుల జాబితా తీసుకోవడం ద్వారా ప్రపంచ రికార్డు సృష్టించాం. గ్రామ పంచాయతీల్లో గత ప్రభుత్వ హయాంలో జాతీయ దినోత్సవాల సమయంలో జెండా పండుగ చేయడానికి రూ. 100 నుంచి రూ. 250 వరకు ఖర్చు చేస్తే.. కూటమి ప్రభుత్వం ఆ ఖర్చుని రూ. 10 వేల నుంచి 25 వేలకు పెంచింది. పంచాయతీరాజ్ శాఖలో సమర్థవంతమైన పాలన అందించేందుకు పునర్నియామకాలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. నరేగా నిధుల ద్వారా గ్రామాల్లో 97.44 మంది ఉపాధి కూలీలకు వారి గ్రామాల్లోనే ఉపాధి అందించాం. రూ. 6 వేల కోట్లు నేరుగా కూలీలకు అందించి ఉపాధితోపాటు ఆర్థిక స్థిరత్వం కల్పించే దిశగా అడుగు ముందుకు వేశాం. గత ప్రభుత్వంలో ఐదేళ్లలో రాష్ట్రవ్యాప్తంగా 4 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు నిర్మిస్తే.. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన 8 నెలల్లోనే రాష్ట్ర వ్యాప్తంగా 4 వేల కిలోమీటర్లకు పైగా సీసీ రోడ్లు నిర్మించాం. వంద మందికి పైగా నివసిస్తున్న గిరిజన గ్రామాల్లో రహదారి సౌకర్యాలు కల్పించాం. డోలీ మోతలు లేని గిరిజన గ్రామాలు చూడాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నాం. ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి సహకారంతో జన్మన్ పథకం కింద విద్యుత్, తాగునీరు వంటి మౌలిక వసతులకు నిధులు కేటాయించాం. ఎంపీడీవోల సమస్యలు మా దృష్టికి తెచ్చారు మీ సమస్య పరిష్కారం వెతుకుతాం. పంచాయతీ సెక్రటరీ అసోసియేషన్.. గ్రామ సచివాలయం, ఇంజినీరింగ్ అసోసియేషన్ సమస్యలకు పరిష్కారం వెతుకుతాం. వాల్మీకి బోయ సంక్షేమ సంఘం నుంచి అర్జీ వచ్చింది. ఇది కేంద్ర ప్రభుత్వం పరిధిలో ఉంది. ముఖ్యమంత్రి గారితోనూ, కేబినెట్లోనూ మీ సమస్యపై మాట్లాడుతాను. రెడ్డి సంఘం నాయకులు కర్నూలు విమానాశ్రయానికి స్వతంత్ర సమరయోధులు శ్రీ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి గారి పేరు ప్రతిపాదించారు. దాన్ని ముందుకు తీసుకువెళ్తాం. నేను కులాలు మతాల గురించి మాట్లాడితే చాలా మందికి ఇబ్బందిగా ఉంటుంది. నేను ధర్మాన్ని మాత్రం బలంగా పాటిస్తాను. నా స్వధర్మాన్ని పాటిస్తాను. అన్ని ధర్మాలను గౌరవిస్తాను. గాజుల బలిజలు బీసీ డి లో చేర్చమని అడిగారు. మీకు న్యాయం జరిగేలా కృషి చేస్తాను. బుడగ జంగాలకి స్వతంత్ర్య అనంతరం కుల ధృవీకరణ కూడా లేకుండాపోయింది. వారికి న్యాయం చేస్తాం.

**అన్ని గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

పాణ్యం నియోజకవర్గానికి సంబంధించి స్థానిక శాసనసభ్యుల కోరిక మేరకు అభివృద్ధి పనులు ముందుకు తీసుకువెళ్తాం. పరిమితి మేరకు ప్రణాళికలు రూపొందించుకుని పూర్తి చేస్తాం. ఉపాధి హామీ బకాయిలు రెండు రోజుల్లో జమ అయ్యేలా చూస్తాం. అవసరం అయితే ఈ విషయంపై ముఖ్యమంత్రి గారితో మాట్లాడుతాం. కొణిదెల గ్రామాన్ని దత్తత తీసుకుంటానని గతంలో చెప్పాను. ఆ గ్రామ అవసరాలు తీర్చేందుకు సొంత ట్రస్ట్ నుంచి రూ.50 లక్షల నిధులు కేటాయించి సౌకర్యాలు కల్పిస్తాం. ప్రభుత్వం పథకాల ద్వారా చేయదగిన పనులు అధికారులతో మాట్లాడి పూర్తి చేస్తాం.

**తలకు పాగా చుట్టి.. గడ్డ పార చేతబట్టి**

పంట పొలాల్లో సేద్యపు నీటి కుంటల (ఫామ్ పాండ్) ప్రారంభోత్సవానికి కర్నూలు జిల్లా, ఓర్వకల్లు మండలం, పుడిచర్లకు వచ్చిన ఉపముఖ్యమంత్రి శ్రీ పవన్ కళ్యాణ్ గారు స్వయంగా ఫామ్ పాండ్ తవ్వకానికి శ్రీకారం చుట్టారు. సొంత వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయం అలవాటు ఉన్న ఆయన తలకు పాగా చుట్టి రైతుగా మారిపోయారు. గడ్డపార చేతబట్టి శంకుస్థాపనకు సిద్ధం చేసిన ప్రాంతంలో గణపతిని పూజించి కుంట తవ్వకాన్ని ప్రారంభించారు.

## ప్రశాంతంగా పదో తరగతి పరీక్షలు

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : రాష్ట్రంలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో భాగంగా శనివారం ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ -2 (కాంపోజిట్ కోర్సు), ఓఎస్ఎస్సీ (ఓరియెంటల్ సెకండరీ స్కూల్ సర్టిఫికేట్) మెయిన్ లాంగ్వేజ్ పరీక్ష సజావుగా జరిగిందని పాఠశాల విద్య సంచాలకులు విజయ్ రామరాజు. ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 93,746 మంది విద్యార్థులకు గానూ 93,405 మంది విద్యార్థులు (99.64 శాతం) హాజరయ్యారని, 330 మంది గైర్హాజరయ్యారని తెలిపారు. 2,234 కేంద్రాల్లో పరీక్షలు జరుగుతుండగా 857 కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్లు తనిఖీ చేశారని తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి డాన్ బాస్కో పాఠశాలలో పరీక్ష రాస్తున్న ముగ్గురు రెగ్యులర్ విద్యార్థులకు ఇన్విజిలేటర్ తప్పిదంతో సంస్కృతం పరీక్షకు సంబంధించిన ప్రశ్నాపత్రాన్ని, ముగ్గురు ప్రైవేటు విద్యార్థులకు రెగ్యూలర్ ప్రశ్నాపత్రం అందించారు. పరీక్ష అనంతరం విద్యార్థులు గమనించడంతో ఆందోళనకు గురయ్యారు. ఈ విషయాన్ని ఆ విద్యార్థుల తల్లిదండ్రులు అధికారులు దృష్టికి తీసుకురాగా ఉన్నతాధికారులు స్పందించి స్థానిక అధికారుల నుండి నివేదిక తెప్పించి, సంస్కృతం పరీక్ష రాసిన ఆరుగురు విద్యార్థులకు అన్యాయం జరగకుండా మూల్యాంకనం జరిగినప్పుడు చర్యలు తీసుకుంటామన్నారు. తప్పిదానికి కారణమైన ఇన్విజిలేటరును సస్పెండ్ చేసి, చీఫ్ సూపరిండెంట్, డిపార్టుమెంట్ ఆఫీసర్ లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.


## విజయవాడలో రెండు రోజుల ట్రావెల్ ఎగ్జిబిషన్



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : జాతీయ, అంతర్జాతీయ పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా విజయవాడలో రెండు రోజుల ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశామని ఇండియన్ ఇంటర్నేషనల్ ట్రావెల్ ఎగ్జిబిషన్(ఐఐటీఈ) డైరెక్టర్ అనురాగ్ గుప్తా తెలిపారు. శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన మాట్లాడుతూ విజయవాడ బందర్ రోడ్‌లోని రాఘవయ్య పార్క్ సమీపంలోని విజయ కృష్ణ సూపర్ బజార్‌పైన ఉన్న అమరావతి కన్వెన్షన్స్‌లో ఈ నెల 22, 23 తేదీలలో ఉదయం 11.30 గంటల నుంచి సాయంత్రం 7 గంటల వరకు ప్రదర్శన ఉంటుందన్నారు. భారతదేశంలో ప్రీమియర్ ట్రావెల్ అండ్ టూరిజం ఎగ్జిబిషన్ ఇదని చెప్పారు. ఐఐటీఈ అనేది ట్రావెల్, టూరిజం, రైల్వేలు, హాస్పిటాలిటీ, అనుబంధ పరిశ్రమల్లో ఉత్తమమైన వాటిని ఎంపిక చేసి ప్రదర్శిస్తుందని వివరించారు. ఈ ట్రావెల్ ఎగ్జిబిషన్ దేశీయ, అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానాలు, హోటళ్ళు, రిసార్ట్‌లు, అనుబంధ సేవలు, దేశ విదేశీ టూర్ ఆపరేటర్ల వివరాలు అందిస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ టూరిజంతో పాటు మధ్యప్రదేశ్ టూరిజం తదితర రాష్ట్ర పర్యాటక సంస్థలనూ ప్రదర్శిస్తుందన్నారు. దేశీయంగా కూర్గ్‌లోని అత్యంత విలాసవంతమైన రిసార్ట్‌లలో ఒకటైన కర్ణాటక టింబర్ టేల్స్, ఇతర ప్రముఖ ప్రాంతాలనూ చూపిస్తుంది. దేశ, విదేశాల్లోని పర్యాటక ప్రాంతాలకు ప్యాకేజీలను అందించే అనేక ట్రావెల్ ఏజెన్సీలు, హోటళ్ళు, రిసార్ట్‌ల వివరాలను వివరిస్తుందని ఐఐటీఈ డైరెక్టర్ అనురాగ్ గుప్తా వివరించారు. తమ ప్రదర్శనలో అడ్వెంచర్, హనీమూన్, స్పోర్ట్స్ అండ్ వెల్నెస్, క్రూయిజ్‌లు సఫారీలు, , డెస్టినేషన్ వెడ్డింగ్‌లు, తదితర ప్రత్యేక ప్యాకేజీలు కూడా ఉన్నాయన్నారు. ఎగ్జిబిషన్లో స్టాళ్లు ఏర్పాటు చేసిన వారు తాము అందించే గమ్యస్థానాలు, హోటళ్ళు, వసతి, ట్రావెల్, టూర్ ప్యాకేజీలు, ఇతర సేవల గురించిన సమగ్ర సమాచారాన్ని వివరిస్తారని తెలిపారు. దేశీయంగా మధ్యప్రదేశ్, అండమాన్, కర్ణాటక, తమిళనాడు, ఒడిశా, తదితర ప్రాంతాలతోపాటు అంతర్జాతీయ స్థాయిలో దుబాయ్, సింగపూర్, మలేషియా, బాలి, నేపాల్, భూటాన్, స్కాండినేవియా, మరెన్నో దేశాల్లో అద్భుత పర్యాటక ప్రాంతాల అనుభూతులను అందిస్తారని వివరించారు. రాబోయే కాలంలో పర్యాటకుల తాకిడి పెరుగుతుందని, పర్యాటకాన్ని ప్రోత్సహించడంలో విజయవాడ కీలక పాత్ర పోషిస్తుందని అంచనా వేస్తున్నామన్నారు. విజయవాడ, చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలలో పర్యాటకాసక్తిని పెంపొందించడం, వారి సెలవుల్లో అత్యుత్తమ పర్యాటక అనుభవాలను అందించడం తమ ప్రధాన లక్ష్యమని వివరించారు. ప్రయాణికులు గమ్యస్థానాన్ని ఎంచుకోవడానికి వన్ స్టాప్ షాపుగా ఈ ప్రదర్శన ఉంటుందన్నారు. వేసవి సెలవులు, వారాంతపు విహారయాత్రలు, హనీమూన్‌లే కాకుండా ఏడాది పొడవునా సెలవుల్లో ప్రయాణాలు, పర్యాటకానికి అనుకూలమైన అవకాశాలు అందిస్తామన్నారు. సందర్శకులకు ఈ ప్రదర్శన ప్రవేశం పూర్తిగా ఉచితమని, పర్యాటక ప్రియులే కాకుండా నగర వాసులంతా సందర్శించాలని ఐఐటీఈ డైరెక్టర్ అనురాగ్ గుప్తా ఆహ్వానించారు.

# ప్రసూతి మరణాలను తగ్గించడంలో ప్రగతిని సాధించాం

**● సురక్షిత ప్రసవాల కోసం వైద్య సౌకర్యాలను బలోపేతం చేస్తున్నాం ● 2030 నాటికి ప్రసూతి మరణాలను రేటును 70 కన్నా తక్కువ సాధించాలన్నదే లక్ష్యం ● సామాజిక మాధ్యమంలో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ట్వీట్**



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పలు కార్యక్రమాల ద్వారా ఏపీలో ప్రసూతి మరణాలను తగ్గించటంలో గణనీయమైన ప్రగతి సాధించగలిగామని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ సామాజిక మాధ్యమం ఎక్స్ లో ట్వీట్ చేశారు. ప్రసూతి మరణాలను తగ్గించడంతో పాటు మహిళలకు సురక్షితమైన మాతృత్వంతో పాటు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించడంలో ప్రధాని నరేంద్రమోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా పనిచేస్తున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న చర్యల కారణంగా 2014-16 మధ్యకాలంలో లక్ష శిశు జననాలకు నమోదైన 130 ప్రసూతి మరణాల రేటు (ఎంఎంఆర్) 2018-20 నాటికి 97కి తగ్గిందన్నారు. 2030 నాటికి ప్రసూతి మరణాల రేటు లక్షకు 70 కన్నా తక్కువ సాధించాలన్న సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యం (ఎస్డిజి) ఆంధ్రప్రదేశ్ తోపాటు కేరళ, మహారాష్ట్ర, తెలంగాణా వంటి ఎనిమిది రాష్ట్రాలు సాధించాయన్నారు. అదే విధంగా సంస్థాగత ప్రసవాలు 79 శాతం (2015-16లో) నుండి 89 శాతానికి (2019-21లో) పెరిగాయనీ, మొదటి త్రైమాసికంలో గర్భస్థ శిశు సంరక్షణా కేంద్రాల్ని (ఎఎన్ సి) ఆశ్రయించే వారి శాతం 59 నుండి 70కి పెరిగిందని మంత్రి వివరించారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న జననీ సురక్ష యోజన (), ప్రధానమంత్రి మాతృ వందన యోజన (), జననీ శిశు సురక్షా కార్యక్రమం (), సురక్షిత మాతృత్వ ఆశ్వాసన్ (), ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ ( ) వంటి పథకాలు సమగ్ర ప్రసూతి నిర్వహణ, మాతా శిశు సంరక్షణను నిర్ధారిస్తున్నాయని తెలిపారు. లక్ష్య () లేబర్ రూమ్ మరియు ఆపరేషన్ థియేటర్() సంరక్షణ వంటి కార్యక్రమాలు ప్రసూతి సౌకర్యాల నాణ్యతను మరింత మెరుగుపరుస్తున్నాయన్నారు. అంతేకాక అధిక-ప్రమాదకర( ) గర్భాలకు సురక్షిత ప్రసవాలను నిర్వహించడానికి ప్రసూతి ఐసీయూ, విభాగాలు లు బలోపేతం చేశారన్నారు. మాతా, శిశు ప్రాణాలను కాపాడేందుకు మధ్యప్రదేశ్ లో దస్తక్ అభియాన్, తమిళనాడులో అత్యవసర ప్రసూతి సంరక్షణ వంటి వినూత్న ఆవిష్కరణలు అమలులో వున్నాయని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దార్శనిక పాలనలో భారతదేశం 2030 నాటికి ప్రసూతి మరణాల రేటును 70 కన్నా తక్కువ స్థాయికి తేవాలన్న లక్ష్య సాధన దిశగా అడుగులు వేస్తోందని, సహస్రాబ్ది అభివృద్ధి లక్ష్యాలను సాధిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ తన ట్వీట్ లో స్పష్టం చేశారు.



# కడుపుబ్బా నవ్విస్తున్న ఇదీ సంగతి

- సోషల్ మీడియా ట్రెండింగ్‌లో ఎమ్మెల్యేల హాస్యవల్లరి
- 'ఇదీ సంగతి..' రచయిత పొగర్తి నాగేశ్వరరావు
- సీఎం, డిప్యూటీ సీఎం చేతులమీదుగా సన్మానం

అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఎన్నడూ లేనంత ఆనందంతో నవ్వి నవ్వి.. కుర్చీలోంచి లేచి మరీ చప్పట్లు కొడుతూ సంబ రపడటాన్ని ఇటీవల విజయవాడలో శాసనసభ, మండలి సభ్యుల క్రీడా పోటీల ముగింపు వేడుకల్లో చూశాం కదా.. స్పీకర్ అయ్యన్నపాత్రుడు, మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్ సహా మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు.. పొట్ట చెక్కలయ్యేలా నవ్వి హాస్యాన్ని ఆస్వాదించిన.. అద్భుతమైన సన్నివేశం ఆవిష్కృతమైన సంగతి తెలిసిందే. ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ దర్శకత్వ పర్యవేక్షణలో సాగిన ఇదీ..సంగతి.. హాస్యవల్లరి రచయితగా గుంటూరుకు చెందిన సీనియర్ జర్నలిస్టు పొగర్తి నాగేశ్వరరావు పనిచేశారు. అందర్నీ నవ్వించి మెప్పించిన రచయితగా, సహాయ దర్శకునిగా పొగర్తి నాగేశ్వరరావును గుర్తించి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వారి చేతుల గౌరవ సన్మానం చేశారు. ప్రభుత్వం తరవున అదే కార్యక్రమంలో జ్ఞాపికను అందజేశారు. ప్రస్తుతం యూ ట్యూబ్, ఇన్ స్టా, ట్విట్టర్ సహా సోషల్ మీడియా ట్రెండింగ్ లో ఈ హాస్యవల్లరి సన్నివేశాలు చక్కర్లు కొడుతున్నాయి. ప్రభుత్వ చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులు ఎమ్మెల్యే ఏడుకొండలు పాత్రలో పరకాయ ప్రవేశం చేసి స్కిట్టు ఆద్యంతం హాస్యం పండించారు. ఆయన పీఏగా గూడూరు ఎమ్మెల్యే సునీల్, కార్యకర్త లుగా ఎమ్మెల్యేలు విష్ణుకుమార్రాజు, జూల కంటి బ్రహ్మారెడ్డి, అరవిందబాబు, కూన రవికు మార్ చేసిన హాస్యం కడుపుబ్బా నవ్వించింది. ఇంటర్ తప్పిన తన తమ్ముడికి ఇంజనీరింగ్లో సీటు కావాలి, అన్నీ మన కాలేజీలే కదన్నా... ఒకటి ఇప్పించేయ్.. అని కార్యకర్తగా మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి,పది తప్పిన తన కూతురికి హెడ్మాస్టర్ పోస్టు డిగ్రీ సగమే చదివిన కొడుక్కి ఎస్పీ పోస్టు ఇప్పించమంటూ మరో కార్యకర్తగా నరసరావుపేట ఎమ్మెల్యే చదలవాడ అరవింద్ బాబు, సినిమా కథ రాశాను.. బాలకృష్ణ, పవన్ కల్యాణ్ ను ఒప్పించమంటూ మరో ఎమ్మెల్యే కూన రవికుమార్ అడగడం. అవన్నీ చేయలేమంటూ నచ్చజెప్పేందుకు ఎమ్మెల్యే జి.వి. చేసిన ప్రయత్నం నవ్వులు పూయించింది.

## డీలిమిటేషన్‌తో దక్షిణాది తీరని నష్టం



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : డీలిమిటేషన్ పై దక్షిణాది రాష్ట్రాలది రాజకీయం కాదని.. ప్రజల హక్కుల కోసం చేసే పోరాటమన్నారు ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. చెన్నైలో తమిళనాడు సీఎం స్టాలిన్ అధ్యక్షతన నేడు జరుగుతున్న డీలిమిటేషన్ సదస్సు నేపథ్యంలో ఆమె ఒక లేఖ ద్వారా తన అభిప్రాయాలను వెలిబుచ్చారు..జనాభా ప్రాతిపదికన సీట్లను విభజిస్తే దక్షిణాదికి జరిగేది తీరని నష్టమేనని అన్నారు.. ఉత్తరాది ప్రాబల్యం మరింతగా పెరిగి.. సౌత్ రాష్ట్రాల ప్రాధాన్యతతో పనిలేకుండా పోతుందని హెచ్చరించారు.. సొమ్ము సౌత్ ది.. సోకు నార్త్ ది అనే పరిస్థితి ఎదురుకాక తప్పదని పేర్కొన్నారు షర్మిల. జనభా ప్రాతిపదికన డీలిమిటేషన్ పేరుతో లిమిటేషన్ ఫర్ సౌత్లా చేస్తామంటే ఊరుకునేది లేదని కేంద్రాన్ని ఆమె హెచ్చరించారు. జనాభా ప్రాతిపదికన పునర్విభజనను అంగీకరించే ప్రసక్తే లేదని తేల్చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రస్తుత విధానంతో ఒక్క ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోనే 143 సీట్లకు పెరిగితే దక్షిణాదిలోని తమిళనాడు, కర్ణాటక, ఏపీ, తెలంగాణ లాంటి ప్రధాన రాష్ట్రాల్లో పెరిగే సీట్లు 49+41+54 = 144 సీట్లు మాత్రమేనని గణాంకాలతో చెప్పారు.. ఇది కాదా వివక్ష చూపడం అంటే ? యూపీ, బీహార్ రెండు రాష్ట్రాలు కలిపితే 222 సీట్లు పెరిగితే.. సౌత్ మొత్తం తిప్పి కొట్టినా 192 సీట్లకే పరిమితం. ఇది కాదా దక్షిణ భారతంకి జరిగే అన్యాయం ? అంటూ పేర్కొన్నారు షర్మిల.డీలిమిటేషన్ పై దక్షిణాది రాష్ట్రాల పోరాటానికి ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందన్నారు షర్మిల. ఐక్యంగా పోరాటం చేస్తే తప్పా నియంత మోడీకి బుద్ధి రాదని అన్నారు. ఏపీలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ లు డిలిమిటేషన్ పై మౌనం వహించడం రాష్ట్ర ప్రజలను మోసం చేసినట్లేనని పేర్కొన్నారు.

# వాయిదాల్లో భవన నిర్మాణ ఫీజులు

- 10 శాతం వడ్డీని చెల్లించే విధంగా అంగీకారం
- బిల్డర్ల వినతికి అంగీకరించిన మంత్రి నారాయణ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఏపీలో ఐదేళ్లుగా కుదేలైన రియల్ ఎస్టేట్ రంగానికి తిరిగి ఊపుతెచ్చేందుకు ప్రయత్నిస్తున్న కూటమి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రియల్ ఎస్టేట్ రంగంలో కీలకమైన బిల్డర్ల కోరిక మేరకు వారికి ఓ కీలక వెసులుబాటునిస్తూ అంగీకారం తెలిపింది.

తాజాగా మంత్రి నారాయణతో జరిగిన భేటీలో ఈ మేరకు రియల్ ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు, అధికారులకు క్లారిటీ ఇచ్చారు. ఇది కచ్చితంగా బిల్డర్లకు తమ భవనాల నిర్మాణం వేగవంతం చేసేందుకు ఉపయోగపడుతుందని భావిస్తున్నారు.రాష్ట్రంలో భవన నిర్మాణాలు చేసే బిల్డర్లు ప్రభుత్వానికి చెల్లించాల్సిన బిల్డింగ్ ఫీజుల్ని వాయిదాల్లో చెల్లించేందుకు మంత్రి నారాయణ అంగీకరించారు.

ప్రస్తుతం బిల్డర్లు భవన నిర్మాణం ప్రారంభించగానే ఆయా ఫీజుల్ని ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. ఇలా భవన నిర్మాణం పూర్తి కాక ముందే ఫీజులు ప్రభుత్వానికి చెల్లించడం తమకు భారంగా మారిందని వారు తెలిపారు. అలా కాకుండా భవన నిర్మాణం పూర్తయి ఆక్యుపెన్సీ సర్టిఫికెట్ వచ్చేలోగా వాటిని వాయిదాల్లో చెల్లించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.

దీంతో ప్రభుత్వం ఈ ఫీజుల్ని భవన నిర్మాణం ప్రారంభమైన తర్వాత వాయిదాల్లో 10 శాతం వడ్డీతో కలిపి చెల్లించేందుకు అనుమతి ఇచ్చింది. తద్వారా వారిపై ఆర్థిక భారం తగ్గనుంది. అదే సమయంలో 300 చదరవు మీటర్లలో నిర్మించే భవనాలకు సెట్ బ్యాక్ తగ్గింవు, 300–500 చదరవు మీటర్లలో నిర్మించే భవనాలకు సెట్ బ్యాక్ తగ్గింవుతో పాటు టీడీఆర్ బాండ్లు వాడుకునే అవకాశం కల్పించాలన్న విజ్ఞప్తిపైనా ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. దీంతో ఆయా విషయాల్లోనూ వారికి ఊరటదక్కే అవకాశం ఉంది.

మరోవైవు బిల్డింగ్ పర్మిషన్ల కోసం సివిల్ ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లకు ఆన్ లైన్ లో ప్లాన్ దరఖాస్తు చేసేందుకు ఇచ్చే సర్వేయర్ లైసెన్స్ ను కేవలం రూపాయికే ఇచ్చేందుకు కూడా ప్రభుత్వం అనుమతి ఇచ్చింది.

దీంతో ప్రస్తుతం రూ.5 వేలుగా ఉన్న ఈ ఫీజు కాస్తా రూపాయికి తగ్గబోతోంది. అలాగే భవన నిర్మాణాలకు ఫాస్ట్ ట్రాక్ విధానంలో అనుమతుల జారీ విషయంలోనూ చర్యలు తీసుకుంటామని మంత్రి నారాయణ హామీ ఇచ్చారు.

## ధాన్యం కొనుగోళ్లలో చారిత్రాత్మక మైలురాయి చేరాం



ఖరీఫ్ ధాన్యం కొనుగోళ్లలో కూటమి ప్రభుత్వం ఓ చారిత్రాత్మక మైలురాయికి చేరింది. ఏ రాష్ట్ర ప్రభుత్వం కూడా కొనుగోలు చేయని విధంగా కూటమి ప్రభుత్వం 22వ తేదీ ఉదయం నాటికి రూ. 8,003 కోట్ల మేర ధాన్యం కొనుగోళ్లు చేసి చారిత్రాత్మక మైలురాయిని చేరిందని రాష్ట్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. శ్రీకాకుళం నుంచి అనంతవురం వరకు ప్రతి జిల్లాలోనూ రైతులను ఏమాత్రం ఇబ్బందిపెట్టకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ కొనసాగించినట్లు పేర్కొన్నారు. రికార్డు స్థాయిలో 34,78,445 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు, తూకం తేడాలు, తేమ శాతం తేడాలు లేకుండా నిబద్ధతతో ధాన్యం కొనుగోలు చేయడం కూటమి ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనం అన్నారు. శనివారం సాయంత్రం తెనాలిలోని మంత్రి మనోహర్ క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ నాదెండ్ల మనోహర్ గారు మాట్లాడుతూ గత వైసీపీ హయాంలో అన్నదాతలు పండించిన ధాన్యాన్ని అమ్ముకోవడానికి నానా తంటాలు పడేవారు. దళారీల ప్రమేయంతో అహర్నిశలు శ్రమ చేసి పండించిన పంటను సరైన ధరకు అమ్ముకోలేక మధనపడేవారు. అప్పటి ప్రభుత్వమే ఏ మిల్లర్ కు అమ్మాలో కూడా నిర్ణయించేది. మిల్లుల దగ్గర రాత్రంబవళ్లు వేచి చూసి మరి ధాన్యం అమ్ముకోవలసిన పరిస్థితి ఉండేది. ఎంత చేసిన సరైన మద్దతు ధర రాక తేమశాతం పేరు చెప్పి అన్నదాతను నిలువునా మోసం చేసేవారు.

# చలివేంద్రాల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో చలివేంద్రాన్ని ప్రారంభించిన మంత్రి కందుల దుర్గేష్
- చలివేంద్రం ద్వారా ప్రజలకు మజ్జిగ, మంచినీళ్లు పంపిణీ చేసిన మంత్రి దుర్గేష్
- ప్రజలకు త్రాగునీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపాలిటీదే అని వెల్లడించిన మంత్రి దుర్గేష్
- ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా జాగ్రత్తగా ఉండాలని సూచన



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వేసవిలో నిడదవోలులో పట్టణంలోని 28 వార్డుల్లో ప్రజలకు నీటి కొరత లేకుండా మంచినీరు సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను మంత్రి కందుల దుర్గేష్ ఆదేశించారు. శనివారం ఉదయం మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో మంత్రి కందుల దుర్గేష్ చలివేంద్రాన్ని ప్రారంభించారు. ప్రజల దాహార్తిని తీర్చేలా చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ప్రజలు చలివేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు.రోజురోజుకు ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి దుర్గేష్ సూచించారు.

వడదెబ్బ తగిలే అవకాశముండంతో ప్రజలంతా అత్యవసరమైతే తప్ప బయటికి రావొద్దని సూచించారు. ఏవైనా పనులు ఉంటే ఉదయం, సాయంత్రం వేళల్లో చేసుకోవాలన్నారు. ఇంట్లోనే ఉండేందుకు ప్రయత్నించాలని, తప్పనిసరైతే చేతిలో వాటర్ బాటిల్, గొడుగు, టోపీలు, కాటన్ దుస్తులు ధరించి బయటికి రావాలని సూచించారు. ప్రభుత్వం తరవున అవసరమైన అన్ని సదుపాయాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఆస్పత్రుల్లో ఎలక్ట్రోల్ వాటర్, ఓఆర్ఎస్ లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విషయమై వైద్యశాఖాధికారులతో చర్చించానన్నారు. డీహైడ్రేషన్ కాకుండా ఎప్పటికప్పుడు నీళ్లు తాగుతూ ఉండాలని సూచించారు. అనంతరం మంత్రి కందుల దుర్గేష్ పలువురికి మజ్జిగ, మంచినీళ్లను తన చేతుల మీదుగా స్వయంగా పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్యాలయం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.గతంలో ఎన్నడూ లేని విధంగా మార్చి నెల నుండే రాష్ట్రంలో ఎండల తీవ్రత ఎక్కువగా ఉందన్నారు.ప్రత్యేకించి నిడదవోలు ప్రాంతంలో ఎండలు మరీ ఎక్కువగా ఉన్నాయన్నారు. ఈ సందర్భంలో ప్రజలకు త్రాగునీటి ఎద్దడి లేకుండా చూడాల్సిన బాధ్యత మున్సిపాలిటీ పై ఉందన్నారు. ఈ క్రమంలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో నిడదవోలు పట్టణంలో మూడు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తే ప్రస్తుతం ఆ సంఖ్య 6కు పెంచాలని మున్సిపల్ కమిషనర్ కు సూచించానన్నారు. ఎక్కడెక్కడ మంచినీటి సదుపాయం లేదో గుర్తించి ఆయా ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రజలకు నిత్యం మంచి నీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించానన్నారు.

వేసవి కాలంలో నీళ్లు దొరకడం లేదన్న సమస్య రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి దుర్గేష్ వెల్లడించారు. అవసరమైతే అదనవు ట్యాంకర్లు ఏర్పాటు చేసైనా సరే ప్రజలకు నీటి కొరత లేకుండా చూడాలన్నారు.చలివేంద్రం ద్వారా మున్సిపాలిటీ అందించే నీరు, మజ్జిగ విషయంలో నాణ్యతకు లోటులేదన్నారు. రాబోయే రోజుల్లో నీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మున్సిపాలిటీ కార్యాలయ అధికారులకు ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ సూచించారు. ప్రజలంతా సుఖశాంతులతో ఉండాలని ఈ సందర్భంగా మంత్రి దుర్గేష్ అన్నారు.

## జైలు నుంచి విడుదలైన పోసాని



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : వైసీపీ నేత, టాలీవుడ్ నటుడు పోసాని కృష్ణమురళికి ఎట్టకేలకు జైలు జీవితం నుంచి విముక్తి లభించింది. గత నెలలో తొలిసారి చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పై వ్యాఖ్యల కేసులో అరెస్టు తర్వాత ఆయనపై రాష్ట్రవ్యాప్తంగా 17 కేసులు నమోదయ్యాయి. అలాగే సీఐడీ కూడా చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఫోటోలు మార్ఫింగ్ చేసి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మరో కేసు నమోదు చేసింది. ఇతర కేసుల్లో ముందుగా బెయిల్ లభించినా సీఐడీ కేసులో మాత్రం పోసానికి జైలులోనే ఉండిపోక తప్పలేదు. ఈ నేపథ్యంలో నిన్న గుంటూరులోని సీఐడీ కోర్టు.. పోసాని కృష్ణమురళికి షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. అయితే బెయిల్ షరతుల్లో ఒకటైన పూచీకత్తు సమర్పణ ఆలస్యం కావడంతో నిన్న ఆయన జైలు నుంచి విడుదల కాలేదు. ఇవాళ మాత్రం బెయిల్ షరతులు పూర్తి చేసి ఆయన జైలు నుంచి విడుదలయ్యారు. అనంతరం హైదరాబాద్ లోని ఇంటికి బయలుదేరి వెళ్లినట్లు తెలుస్తోంది. గత వైసీపీ ప్రభుత్వంలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యవహారంలో పోలీసుల దర్యాప్తుకు సహకరించాలనే షరతుపై పోసాని కృష్ణమురళికి పలు కోర్టులు బెయిల్ ఇచ్చాయి.

అలాగే మరికొన్ని కేసుల్లో నోటీసు ఇచ్చి విచారణ జరపాలని హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. దీంతో పోలీసులు ఏ క్షణమైనా తిరిగి ఆయన్ను విచారణకు రమ్మని పిలిచే అవకాశాలు కూడా లేకపోలేదు. గతంలోనూ పోలీసులు నమోదు చేసిన కేసుల్లో బెయిల్ లభించిన తర్వాత జైలు నుంచి విడుదలయ్యే లోపే సీఐడీ పోలీసులు తమ కేసులో పీటీ వారెంట్ దాఖలు చేసి ఆయన్ను అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఆయన జైల్లోనే ఉన్నారు. చివరికి 26 రోజుల జైలు జీవితం తర్వాత పోసాని ఇవాళ విడుదలయ్యారు. దీంతో ఆయనకు పూర్తి ఊరట లభించినట్లయింది.

# నాలుగు రోజుల్లో వర్షాలు



### వాతావరణ శాఖ హెచ్చరిక

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : ఎండల్లో రాష్ట్ర ప్రజలకు చల్లటి శుభవార్తను అమరావతి వాతావరణశాఖ వినిపించింది. రాబోయే నాలుగు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. అలాగే గంటకు 30 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని, తీర ప్రాంతాల్లో నివసించేవారు జాగ్రత్తగా ఉండాలని అధికారులు తెలిపారు. ఈ తరహా వాతావరణం ఈ నెలాఖరు వరకు కొనసాగే అవకాశం ఉంది. దీంతో ప్రజలు హమ్మయ్య అనుకుంటున్నారు. కొద్దిరోజులుగా ఎండలతో ఉక్కిరి బిక్కిరి అవుతున్న ప్రజలకు ఈ వార్తతో వర్షం కురవకుండానే వారిపై చల్లటి జల్లులు పడినట్లైంది.

బలహీనపడిన ద్రోణి బంగాళాఖాతంలో ఒడిసా రాష్ట్రం నుంచి దక్షిణ విదర్భ వరకు ద్రోణి ఏర్పడింది. చత్తీస్ గడ్ వరకు విస్తరించిన ఈ ద్రోణి బలహీనపడింది. దీంతో నైరుతి దిశగా గాలులు వీస్తున్నాయి. ఈ ప్రభావం వల్లే నాలుగు రోజులపాటు ఏపీలో వర్షాలతోపాటు చల్లటి వాతావరణం నెలకొననుంది. రాయలసీమలో తేలికపాటి నుంచి సాధారణ వర్షాలు కురుస్తాయి. దక్షిణ కోస్తాలో మోస్తరు వానలు, ఉరుములు, పిడుగులు పడతాయి. ఉత్తర కోస్తాలో మోస్తరు వర్షాలతోపాటు తేలికపాటి జల్లులు పడతాయి. ఏపీతోపాటు తెలంగాణలో కూడా వర్షాలు పడుతున్నాయి. శుక్రవారం రాత్ర హైదరాబాద్ నగరంలో ఉరుములు, మెరువులతో భారీ వాన కురిసింది. 23వ తేదీ వరకు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది.మార్చిలోనే ఎండలు మండిపోతున్నాయి రెండు రాష్ట్రాల్లోను వేసవికాలం రాకుండానే మార్చి నెలలో ఎండలు మండిపోతుండటంతోపాటు కొన్ని ప్రాంతాల్లో వడగాడ్పులు వీస్తున్నాయి. ప్రస్తుతం వాతావరణం చల్లబడటంతో ఊపిరి పీల్చుకుంటున్నారు. రాయలసీమలోని కొన్ని ప్రాంతాల్లో 40.9, 40.6 డిగ్రీల చొప్పున అత్యధిక ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగా పలు మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. అకాల వర్షాల వల్ల పంటలు దెబ్బతింటాయని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈదురు గాలులకు కావుకొచ్చిన దశలో మామిడికాయలు రాలిపోయాయి. అలాగే విత్తనాలు వేసి పంట మొలకెత్తే సమయంలో ఈ నెలాఖరు వరకు వానలు పడతాయని వాతావరణ కేంద్రం తెలపడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన ఘటనను ఖండించిన సీఎం

### ఘటనపై డీజీపీతో సమీక్ష...కఠిన చర్యలకు ఆదేశం



అమరావతి, మార్చి : తూర్పు గోదావరి జిల్లా, గోపాలవురం నియోజకవర్గం, నల్లజర్ల మండలం, దూబచర్లగాంధీ కాలనీలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించిన ఘటనను సీఎం చంద్రబాబు నాయుడు ఖండించారు. భారతరత్న అంబేద్కర్ను అగౌరవపరిచేలా విగ్రహం పట్ల దుశ్చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఘటనపై డీజీపీ, పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడిన ముఖ్యమంత్రి...కుట్రతో ఇటువంటి నేరాలకు పాల్పడుతున్నవారిపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు, ఆయా వర్గాల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించేవారిపట్ల అత్యంత కఠిన వ్యవహరించి, ఇటవుంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. పోలీసులు మరింత అప్రమత్తంగా ఉండాలని, వివిధ వర్గాల మధ్య వైషమ్యాలు రెచ్చగొట్టేవారిపై నిఘా ఉంచాలని సీఎం చంద్రబాబు సూచించారు.

# అత్యాధునిక హాజ్ హౌస్ నిర్మిస్తాము

- ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)
- ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు
- రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపిన ఎంపి కేశినేని
- హాజరైన ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, రాజగోపాల్ శ్రీరామ్ (తాతయ్య), తంగిరాల సౌమ్య, వసంత కృష్ణ ప్రసాద్,
- ముస్లిం మత పెద్దలతో కలిసి ఎంపి కేశినేని ప్రార్థనలు



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : టిడిపి ముస్లిం సమాజానికి అండగా వుంటుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో చెప్పినట్లు ఇమామ్ , మౌజమ్ లకు పదివేలు, ఐదువేల రూపాయలు గౌరవవేతనం అందిస్తున్నారు. చెప్పిన మాట మీద నిలబడే వ్యక్తి సీఎం చంద్రబాబు నాయుడు అని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ అన్నారు.

గురునానక్ కాలనీలోని విజయవాడ పార్లమెంట్ కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో శుక్రవారం ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఇచ్చారు. టిడిపి మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమ నిర్వహణ జరిగింది. ముస్లిం మత పెద్దలతో కలిసి ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) ప్రార్థనలు చేశారు.అనంతరం ముస్లిం మత పెద్దలు, ముస్లిం సోదరులతో కలిసి ఖర్జూర పండ్లు అరగించారు. అనంతరం విందులో పాల్గొన్న ముస్లిం సోదరులకు ఎంపి కేశినేని శివనాథ్ స్వయంగా వడ్డన చేశారు. ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, తంగిరాల సౌమ్య, వసంతకృష్ణ ప్రసాద్, శ్రీరామ్ రాజగోపాల్ (తాతయ్య), మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న పాల్గొన్నారు.

ప్రార్థనలు అనంతరం ఎంపి కేశినేని శివనాథ్ మాట్లాడుతూ ఆ అల్లా దయవల్ల దేశం, రాష్ట్ర బాగుండాలన్నారు. విజయవాడ ఆటోనగర్ లోని ఆటో మొబైల్ రంగంలో ముస్లిమ్స్ చాలా మంది పనిచేస్తున్నారు. ముస్లిం సామాజిక వర్గం విజయవాడ నగర అభివృద్ధిలో వారి పాత్ర చాలా ఉందని పేర్కొన్నారు. చిన్నతనం నుంచి ముస్లిం సోదరులతో కలిసి తిరిగాను...వారికి ఆత్మీయుడిగా వుంటానని తెలిపారు. ఏ సమస్య వున్నా సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి ఏ ఇబ్బంది లేకుండా అండగా వుంటానన్నారు. హైదరాబాద్ లో చంద్రబాబు ముఖ్యమంత్రిగా వున్న సమయంలోనే హాజ్ హౌస్ నిర్మాణం జరిగిందని, అంతకంటే అత్యాధునికంగా హాజ్ హౌస్ ను నిర్మించేందుకు కృషి చేస్తామని తెలిపారు. అలాగే పశ్చిమ నియోజకవర్గం ఉర్దూ కాలేజీ టిడిపి ప్రభుత్వంలోనే ఏర్పాటు చేయటం జరిగిందని గుర్తు చేశారు. సీఎం చంద్రబాబు కు అన్ని కులాలు, మతాలపై ఒకే విధమైన ప్రేమ వుంటుందన్నారు. ముస్లిమ్ సమాజం ఎంత స్వచ్ఛంగా నీతినియమాలతో వుంటారో అదే విధంగా తాము వుంటామని చెప్పారు. ముస్లిం సోదరలకు రంజాన్ మాస శుభాకాంక్షలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి ఎమ్.ఎస్.బేగ్, ఎన్టీఆర్ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు కరీముల్లా, టిడిపి రాష్ట్ర నాయకులు జంపాల సీతారామయ్య,గన్నే ప్రసాద్, మాదిగాని గురునాథం, విజయవాడ అర్బన్ మాజీ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఇర్ఫాన్, ఫిరోజ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## జనాభా ప్రాతిపదికన డీ లిమిటేషన్ వద్దు

- దీని వలన ఉత్తరాదిలో సీట్లు పెరుగుతాయి
- దక్షిణాదికి తగ్గుతాయి : వైఎస్ జగన్

ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : డీలిమిటేషన్ (నియోజకవర్గాల పునర్విభజన) ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళన నెలకొన్న సంగతి తెలిసిందే. డీలిమిటేషన్ వల్ల ఉత్తరాది రాష్ట్రాల్లో లోక్ సభ స్థానాలు పెరుగుతాయని, దక్షిణాది రాష్ట్రాలకు తీరని అన్యాయం జరుగుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీకి వైసీపీ అధినేత జగన్ లేఖ రాశారు. ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ కారణంగా పార్లమెంట్ లో దక్షిణాది రాష్ట్రాల భాగస్వామ్యం కచ్చితంగా తగ్గుతుందని అందుకే జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ లేకుండా చూడాలని కోరుతున్నామని లేఖలో జగన్ పేర్కొన్నారు.

పార్లమెంట్ లో తీసుకునే నిర్ణయాల్లో అన్ని రాష్ట్రాలకు సమాన భాగస్వామ్యం కల్పించేలా ఉండాలని జగన్ చెప్పారు. అందుకే దక్షిణాది రాష్ట్రాల ఎంపీ సీట్లు తగ్గకుండా చూడాలని కోరారు. ఏ రాష్ట్రానికి ప్రాతినిధ్యం తగ్గకుండా డీలిమిటేషన్ కసరత్తు జరగాలని కేంద్రాన్ని కోరుతున్నానని చెప్పారు.

# విపత్తుల నిర్వహణలో అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాల వినియోగం కీలకం

- రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (విపత్తుల నిర్వహణ) అర్ పి సిసోడియా
- రసాయన కర్మాగారాల వద్ద గాలి నాణ్యత పర్యవేక్షణ పరికరాలు
- డ్రోన్ టెక్నాలజీ వినియోగం వాట్స్ యాప్ ద్వారా విపత్తుల నిర్వహణ



ఏపీ స్టేట్ బ్యూరో, సూర్య ప్రధాన ప్రతినిధి : విపత్తుల నిర్వహణలో అత్యాధునిక కమ్యూనికేషన్ పరికరాలు అత్యవసరమని రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి (విపత్తుల నిర్వహణ, భూపరిపాలన, స్టాంప్స్ రిజిస్ట్రేషన్స్ , సర్వే సెటిల్మెంట్), ఆంధ్ర ప్రదేశ్ మానవ వనరుల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ జనరల్ ఆర్.పి. సిసోడియా పేర్కొన్నారు. తీరప్రాంతాల్లో ఎమ్మార్వో స్థాయి నుండి జిల్లా కలెక్టర్ వరకు ప్రతి అధికారికి శాటిలైట్ ఫోన్లు అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. తద్వారా విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కొని ప్రాణనష్టం నివారించవచ్చని చెప్పారు. శనివారం విపత్తుల నిర్వహణ కార్యాలయంలో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత ఐదేళ్లలో కొనుగోలు చేసిన పరికరాల వినియోగ స్థితి, రాబోయే వర్షాకాలానికి అవసరమైన సన్నద్ధత, బడ్జెట్, తీవ్ర ఉష్ణప్రవాహాల (హీట్ వేవ్స్) కోసం తీసుకోవాల్సిన చర్యలు తదితర అంశాలను సమీక్షించారు. జిల్లాల స్థాయిలో మానవ వనరులు, పరికరాల అందుబాటు పరిస్థితులను అంచనా వేసి, తుపానుల హెచ్చరికా కేంద్రాల పనితీరును సమీక్షించారు.సమావేశంలో హానికర, రసాయన కర్మాగారాల సమీపంలో గాలి నాణ్యత పర్యవేక్షణ పరికరాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. వాయు కాలుష్యం లేదా రసాయన గ్యాస్ లీకేజీ వంటి ప్రమాదాలను ముందుగానే గుర్తించి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వర్షాకాలానికి ముందుగా జి ఐ ఎస్ ప్లాట్ఫారమ్ను సిద్ధం చేయడంతో పాటు, ఐ ఒ టి పరికరాలను వినియోగించి ఆన్లైన్ డేటాను తక్షణమే అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.సిసోడియా మాట్లాడుతూ, విపత్తుల నిర్వహణలో డ్రోన్ టెక్నాలజీని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, అవసరమైన డ్రోన్ పైలెట్లను ఎంపానల్ చేసి సిద్ధంగా ఉంచాలని సూచించారు. నైట్ విజన్ డ్రోన్ల ప్రాముఖ్యతను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని అన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలో ప్రభుత్వం వాట్స్ అప్ ఆధారిత సేవలను అందుబాటులోకి తెచ్చిందని, అదే విధంగా విపత్తుల నిర్వహణలో వినియోగించే దిశగా ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. వాట్స్ అప్ ఆధారిత సమీకృత విపత్తుల నిర్వహణ వ్యవస్థను అభివృద్ధి చేయాలని అధికా రులకు సూచించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత విపత్తుల నిర్వహణ విధానాన్ని రూపొందించాలని, ప్రపంచ బ్యాంకు నిధులతో అమలవుతున్న ఆంధ్రప్రదేశ్ డిజాస్టర్ రికవరీ ప్రాజెక్ట్ పరిధిలో కొనుగోలు చేసిన పరికరాలు, అందుబాటులో ఉన్నవి, ప్రస్తుతం వినియోగంలో ఉన్నవి అనే అంశాలపై పూర్తి స్థాయి నివేదిక అందించాలని సిసోడియా అధికారులను ఆదేశించారు. విపత్తుల నిర్వహణ కోసం ఇప్పటికే ఉన్న యాప్ను మరింత మెరుగుపరచాలని, కొత్త ఫీచర్లు జోడించి ప్రజలకు విస్తృతంగా ప్రచారం కల్పించాలని సూచించారు. విపత్తు సమయంలో ప్రజలకు తక్షణమే సమాచారం అందించేలా ఈ యాప్ను ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దాలని సూచించారు.

Invesco Mutual Fund

The details of upcoming Investor Awareness Program(s) ('IAP') are as follows:

| Date | Time | Meeting ID | Passcode |
| --- | --- | --- | --- |
| March 27, 2025 | 4.00pm | 279 069 986 825 | dN2vY9d9 |

Those who are interested to attend IAP are requested to email the details to us at iap@invesco.com

Date: March 24, 2025

Mutual Fund investments are subject to market risks, read all scheme related documents carefully.

సూర్య

హైదరాబాద్

ఆదివారం

23 మార్చి 2025




# సంపాదకీయం

suryaeditpage@gmail.com

## అమెరికాతో కయ్యానికి ఇరాన్?

ట్రంప్ ఇరాన్ కనుక అణుఒప్పందానికి సిద్ధంగా లేకపోతే దానికి ప్రతిచర్యగా అమెరికా సైన్యాన్ని ఉపయోగించవచ్చు అని ఆ దేశ నేతను బెదిరించే ప్రయత్నం చేసారు. ఇప్పటికే మొండిగా ట్రంప్ కు వ్యతిరేక శక్తిగా తయారవుతున్న ఆయతుల్లా అలీ ఖామెనై మాత్రం అమెరికాను ఏం చేసుకుంటావో చేసుకో, ఏమి చేసినా మేము మాత్రం ఊరుకునేది లేదు,దెబ్బకు దెబ్బ వడ్డిస్తాం అని గట్టిగానే చెప్పారు. ఇరాన్ %-%అమెరికా మధ్య సంబంధాలలో ఎప్పుడూ ఎదో ఒక ఉద్రిక్తత ఉంటూనే ఉంది. ప్రస్తుత సుప్రీమ్ లీడర్ కు అమెరికా పట్ల మొదటినుండి సానుకూల అభిప్రాయం లేదు. గతంలో మొహమ్మద్ మోస్సాదేఖ్ అనే ప్రజాస్వామ్య ప్రధానిని సి ఐ ఏ (సెంట్రల్ ఇంటలిజెన్స్ ఏజెన్సీ)సహాయంతో అమెరికా గద్దె దించేసింది.ఈ కుట్రలో షా మొహమ్మద్ రిజా పహ్లావిను మళ్లీ అధికారంలోకి తెచ్చారు.షా పరిపాలనలో నిర్బంధాలు, దౌర్జన్య పాలన ఎక్కువై, ప్రజలు తిరగబడటానికి కారణమైంది. షా అమెరికాకు మిత్రుడిగా ఉన్నాడు, కానీ ఇరాన్ ప్రజలకు నియంతగా మారాడు.సావక్ అనే రహస్య పోలీసు విభాగాన్ని ఉపయోగించి ఇరాన్ ప్రజలను తీవ్రంగా అణచివేశాడు.అయతుల్లా ఖామెనై అప్పట్లో షా పాలనకు వ్యతిరేకంగా పోరాడి, జైలు శిక్ష అనుభవించాడు.ఇది అతనిలో అమెరికా అంటే ద్వేషం పెరగడానికి ప్రధాన కారణం. ఇరాన్ సిద్ధాంత చరిత్రను గమనిస్తే ఇరాన్ ఇస్లామిక్ రిపబ్లిక్గా మారిన తర్వాత, పశ్చిమ దేశాలను పూర్తిగా తిరస్కరించింది. ఈ సమయంలోనే అమెరికాను "గ్రేట్ శాతాన్" (అతి పెద్ద రాక్షసుడు) అని అమెరికాను విమర్శించడం ప్రారంభమైంది. అమెరికా ఏ దేశంలోనైనా జోక్యం చేసుకుంటుందని ఖామెనై నమ్మడమే కాకుండా,ఇస్లామిక్ పాలనకు అమెరికా ఒక అడ్డంకిగా ఉన్నట్టు భావిస్తున్నాడు. పశ్చిమ దేశాల సంస్కృతి ఇస్లామిక్ సంప్రదాయాలను అమెరికా నాశనం చేస్తుందనే భయం ఇరాన్ నాయకత్వానికి ఉంది. ఇక ఇరాన్ కు అమెరికాతో ఉన్న అతి పెద్ద సమస్య అణుశక్తి అభివృద్ధి విషయం. ఇరాన్ స్వయం శక్తిగా ఎదగాలన్న ఆలోచనతో అణుశక్తి విషయంలో తన స్వాతంత్ర్యాన్ని నిలబెట్టుకోవడానికి ఎప్పటినుండో ప్రయత్నిస్తూనే ఉంది. అమెరికా మాత్రం ఇది అణ్వాయుధ తయారీకి దారి తీస్తుందంటూ నిరోధిస్తోంది.దీంతో అమెరికా ఇరాన్పై కఠిన ఆంక్షలు (సాంక్షన్స్ ) విధించింది. ఇరాన్ మధ్యప్రాచ్యంలో హిజ్బుల్లా , హౌతీలు , షియా మిలీషియా లాంటి సమూహాలకు మద్దతు ఇస్తోంది.ఇది అమెరికా మిత్ర దేశాలైన ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, యు ఏ ఈ లకు నష్టం కలిగిస్తోంది.దీని వల్ల అమెరికా-ఇరాన్ మధ్య మరింత విభేదాలు పెరిగాయి.

హౌతీలు అనేవారు యెమెన్లోని ఒక తిరుగుబాటు గ్రూప్.వీరు ఇరాన్ మద్దతుతో యెమెన్లో ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారు. ఇరాన్ హౌతీలకు ఆయుధాలు, శిక్షణ అందిస్తోందని అమెరికా ఆరోపిస్తోంది.హౌతీలు సౌదీ అరేబియా పై మరియు రెడ్ సీ వ్యాపార మార్గాలపై దాడులు చేస్తున్నాయి. అమెరికా, సౌదీ అరేబియా హౌతీలపై ఎదురుదాడులు చేస్తున్నాయి.ట్రంప్ తిరిగి అధికారంలోకి రాగానే హౌతీలపై కఠినంగా వ్యవహరించాలనే ఆలోచనలో ఉన్నాడు. అమెరికా అదనంగా మరో ఎయిర్క్రాఫ్ట్ క్యారియర్ను మధ్యప్రాచ్యంలోకి పంపించింది. ఇది ఇరాన్కు పెద్ద హెచ్చరిక కూడా. మొత్తం మీద 1953 లో అమెరికా చేసిన కుట్ర,1979 ఇస్లామిక్ విప్లవం తర్వాత పశ్చిమ దేశాలపై వచ్చిన వ్యతిరేకత,అణు కార్యక్రమంపై అమెరికా విధిస్తున్న ఆంక్షలు ,హౌతీలకు మద్దతు ఇస్తున్నందుకు అమెరికా బెదిరింపులు పంపడం,మధ్యప్రాచ్యంలో తన స్వయం ప్రతాపాన్ని నిలుపుకోవాలనుకోవడం వల్లబీ ఈ అమెరికా చర్యలన్నీ కూడా ప్రస్తుత ఇరాన్ నాయకుడి కోపానికి కారణాలు. ఇరాన్ బలమైన దేశం, ప్రస్తుత పరిస్థితుల్లో అమెరికాను కూడా ధైర్యంగా ఎదుర్కోగలనన్న ధీమాతోనే వ్యవహరిస్తూ ఉంది. ఇప్పుడు తాజాగా ఆ దేశ నాయకుడి స్పందన దానికే సంకేతం కూడా. సైనిక శక్తి,ఆర్థిక శక్తి,ప్రాంతీయ ప్రభావం వంటి బలమైన ఆయుధాలతో ఇరాన్ అమెరికాను ఎదుర్కోవడానికి సిద్ధమవుతూ ఉంది. ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ (ఐ ఆర్ జి సి ) అనేది ఒక బలమైన సైనిక విభాగం.ఇరాన్ బాలిస్టిక్ క్షిపణి వ్యవస్థ ప్రపంచ స్థాయిలో అత్యంత శక్తివంతమైనదిగా ఉంది. ఇరాన్ ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద చమురు నిల్వలు కలిగి ఉంది.చమురు ఆదాయంతో ఆర్థికంగా నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తోంది. మధ్యప్రాచ్యంలో హిజ్బుల్లా, హౌతీలు, ఇరాక్ షియా మిలీషియా వంటి గ్రూపుల ద్వారా బలమైన గ్లోబల్ నెట్వర్క్ను కలిగి ఉంది.ఈ ప్రభావం అమెరికా వ్యూహాలకు అడ్డుగోడగా మారుతోంది. ఇప్పుడు ఈ రెండు దేశాల మధ్య శత్రుత్వం ప్రపంచాన్ని కూడా అతలాకుతలం చేసే అవకాశం ఉంది. ఇరాన్ ప్రపంచంలోని ప్రధాన చమురు ఉత్పత్తి దేశాలలో ఒకటి. అమెరికా ఇరాన్పై ఆంక్షలు విధించినప్పుడు లేదా రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పుడు, చమురు సరఫరా కొరత ఏర్పడుతుంది. దీని ఫలితంగా చమురు ధరలు పెరుగుతాయి, ఇది అభివృద్ధి చెందుతున్న దేశాల ఆర్థిక వ్యవస్థలపై భారాన్ని పెంచుతుంది.పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెరిగి సామాన్య ప్రజలకు అధిక వ్యయ భారం ఏర్పడుతుంది.చమురు అధిక ధరల వల్ల ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం పెరుగుతుంది.

ఇరాన్, అమెరికా మధ్య నెలకొన్న విభేదాలు మధ్యప్రాచ్యంలో యుద్ధ భయాన్ని పెంచుతాయి. ముఖ్యంగా ఇరాన్ అనుబంధ గ్రూపులు, ఉగ్రవాద సంస్థలు అమెరికా మిత్రదేశాలపై దాడులు చేయవచ్చు.అమెరికా మిత్రదేశాలైన ఇజ్రాయెల్, సౌదీ అరేబియా, యు ఏ ఈ వంటి దేశాల్లో రక్షణ ఖర్చులు పెరుగుతాయి. హార్ముజ్ జలసంధి ద్వారా జరిగే చమురు సరఫరా భద్రత ప్రమాదంలో పడుతుంది.ఇరాన్-అమెరికా మధ్య ఉద్రిక్తతలు పెరిగినప్పుడు స్టాక్ మార్కెట్లు క్షీణిస్తాయి. అంతర్జాతీయ పెట్టుబడులు అనిశ్చితంగా మారి, దేశాల ఆర్థిక వ్యవస్థలపై ప్రతికూల ప్రభావం చూపిస్తాయి. అమెరికా ఆంక్షల వల్ల ఇరాన్తో వ్యాపారం చేసే దేశాలకు కూడా నష్టాలు వాటిల్లుతాయి. ఇరాన్కు అనుబంధ మిలిటెంట్ గ్రూపులు అమెరికా మిత్రదేశాలపై దాడులు చేయడం పెరిగే అవకాశం ఉంటుంది. ఇరాన్పై ఆంక్షల వల్ల అక్కడ ఆర్థిక అస్థిరత పెరిగి, నిరుద్యోగిత వల్ల ఉగ్రవాద సంస్థలకు యువత ఆకర్షితులవ్వడం జరుగుతుంది. అమెరికా, ఇరాన్ మధ్య వివాదాలు ప్రపంచ రాజకీయ సమీకరణాలను మారుస్తాయి. చైనా, రష్యా లాంటి దేశాలు ఇరాన్కు మద్దతుగా నిలబడటం ద్వారా ప్రపంచ రాజకీయ సమతుల్యత మారుతుంది. ఈ క్రమంలో ఇప్పుడు ఇరాన్ హెచ్చరికకు అమెరికా ఎలా స్పందిస్తుందో చూడాల్సిందే.

# మధ్యతరగతి ప్రజలకు బడ్జెట్ వరమా?భారమా?

- నానాటికి తగ్గుతున్న ప్రజల కొనుగోలు శక్తి
- అసలు పొదుపు అనే మాట మరచిన జనం చాలామంది
- ఉద్యోగాల సృష్టి - వేతనాల పెంపు జరగక ఇబ్బందులు
- దేశీయ కారణాలతో ఇప్పటికే ఆకాశాన్నంటిన నిత్యావసర వస్తువుల ధరలు
- ఇప్పటికే మధ్యతరగతి ప్రజలు ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నారన్నది సుస్పష్టం


తేజస్వి
హైదరాబాద్





భారతదేశంలో మధ్యతరగతి చాలా కాలంగా దేశ ఆర్థిక వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తోంది. కానీ, గత కొన్ని సంవత్సరాలుగా మధ్యతరగతి ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోతోంది, అలాగే సేవింగ్స్ (మొత్తపులు) చేయడం కష్టంగా మారింది. ఈ 2025-26 బడ్జెట్లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యతరగతి ప్రజలకు పన్ను సడలింపులు ప్రకటించారు. అయితే, ఈ సడలింపులు ఉన్నప్పటికీ, మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజల పరిస్థితి పెద్దగా మారినట్టు కనిపించడం లేదు . ఈ పరిస్థితి ఎందుకు ఏర్పడింది? ధనికులు మాత్రమే ఎక్కువగా కొనుగోళ్లు చేయడానికి కారణాలు ఏమిటి?అసలు ఈ బడ్జెట్ ఎలా పరోక్షంగా మధ్యతరగతి ప్రజల జీవితాల్లో సంక్షోభం సృష్టిస్తూ ఉంది? ఈ బడ్జెట్ మధ్యతరగతి వారికి వరమా?భారమా?

మొదటగా, మధ్యతరగతి ప్రజలు చెల్లించే పన్నులను గమనిస్తే, 2024-25 ఆర్థిక సంవత్సరంలో, వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు కార్పొరేట్ పన్నులను మించి ఉన్నాయి. వ్యక్తిగత ఆదాయ పన్ను వసూళ్లు ₹1,156,000 కోట్లుగా ఉండగా, కార్పొరేట్ పన్నులు ₹1,042,830 కోట్లుగా ఉన్నాయి. ఇది మధ్యతరగతి ప్రజలు ఎక్కువ పన్నులు చెల్లిస్తున్నారని సూచిస్తుంది. 2019-20 లో, కార్పొరేట్ పన్నులు తగ్గించబడ్డాయి, ఇది కంపెనీల లాభాలను పెంచింది. అయితే, ఈ లాభాలు ఉద్యోగాల సృష్టి లేదా వేతనాల పెంపులో ప్రతిఫలించలేదు. 2023-24 ఆర్థిక సర్వే ప్రకారం, 33,000 కంపెనీల లాభాలు నాలుగు రెట్లు పెరిగినా, నియామకాలు మరియు వేతనాల పెరుగుదల తక్కువగానే ఉంది. దీంతో, మధ్యతరగతి ప్రజల ఆదాయం స్థిరంగా ఉండి, వారి కొనుగోలు శక్తి తగ్గింది.

మధ్యతరగతి ప్రజలు కొనుగోలుపై జి ఎస్ టి చెల్లించాల్సి వచ్చింది, కానీ కార్పొరేట్లు మాత్రం ఇన్పుట్ ట్యాక్స్ క్రెడిట్ పొందుతాయి. అంటే, కార్పొరేట్లు తమ వ్యయాలపై చెల్లించిన జి ఎస్ టి ని తిరిగి పొందగలవు, కానీ వ్యక్తులు ఆ అవకాశం లేకుండా, పూర్తి జి ఎస్ టి భారం మోయాల్సి ఉంటుంది. ఇది మధ్యతరగతి ప్రజలపై అదనపు ఆర్థిక భారం సృష్టించింది.

అంతర్జాతీయ మరియు దేశీయ కారణాల వల్ల, నిత్యావసర వస్తువుల ధరలు పెరిగాయి. అయితే, మధ్యతరగతి వేతనాలు స్థిరంగా ఉండటం లేదా స్వల్పంగా పెరగడం వల్ల, వారి కొనుగోలు శక్తి తగ్గింది. ఇది వారి ఆదాయం , ఖర్చుల మధ్య వ్యత్యాసాన్ని పెంచింది.ప్రభుత్వం అందించే సేవలు, ముఖ్యంగా ఆరోగ్యం మరియు విద్య, తక్కువ నాణ్యతతో ఉండటం వల్ల, మధ్యతరగతి ప్రజలు ప్రైవేట్ సేవలను ఆశ్రయించాల్సి వస్తుంది. ఇవి అధిక ఖర్చుతో ఉంటాయి, ఇది వారి ఆదాయంలో గణనీయమైన భాగాన్ని తీసుకుంటుంది. దీంతో, వారి ఆదాయం తగ్గిపోతుంది, ఇది వారి కొనుగోలు శక్తిని తగ్గిస్తుంది.

కార్పొరేట్ పన్ను తగ్గింపులు, పెట్టుబడులపై పన్ను సడలింపులు వంటి విధానాల వల్ల ధనికులకు లాభపడుతున్నారు. వారి ఆదాయం, సంపద పెరుగుతుండటంతో, వారు అధిక ఖర్చులు చేయగలరు. ఇది ఆస్తి, విలాసవంతమైన వస్తువులు, మరియు ఇతర ఖరీదైన వస్తువుల కొనుగోలులో ప్రతిఫలిస్తుంది.

ఇతర కారణాలను గమనిస్తే ద్రవ్యోల్బణం ముఖ్య కారణం. ద్రవ్యోల్బణం అంటే ధరల పెరుగుదల. దీని కారణంగా, ఒకప్పుడు కొంత రుసుముతో కొనుగోలు చేసిన వస్తువులు, సేవలు ఇప్పుడు మరింత ఖరీదుగా మారాయి. కూరగాయలు, నిత్యవసరాలు, పాల ఉత్పత్తులు, గ్యాస్, బియ్యం, గోధుమ వంటి తినుబండారాల ధరలు గణనీయంగా పెరిగాయి.ఉదాహరణకు, ఒకప్పుడు ₹50కి లభించిన టమోటా, కొన్నిసార్లు ₹100 పైగా వెళ్లడం జరిగింది.మధ్యతరగతి ప్రజలు అవసరాలను తగ్గించుకోవడం లేదా తక్కువ నాణ్యత గల వస్తువులను కొనుగోలు చేయడం తప్పనిసరి అయ్యింది. ఇంధన ధరల పెరుగుదల అంటే పెట్రోల్, డీజిల్ ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయి.ఇంధన ధరలు పెరిగితే పరిమాణికమైన వస్తువుల రవాణా ఖర్చులు పెరిగి మార్కెట్లో ధరలు మరింత పెరుగుతాయి. ప్రైవేట్ పాఠశాలలు, కాలేజీల ఫీజులు అధికమవ్వడంతో మధ్యతరగతి కుటుంబాలు నాణ్యమైన విద్యను అందించడంలో కష్టపడుతున్నాయి.వైద్య ఖర్చులు పెరగడంతో కుటుంబ బడ్జెట్పై భారంగా మారింది.

ద్రవ్యోల్బణం పెరిగినా, ఉద్యోగస్తుల వేతనాలు ఆ స్థాయిలో పెరగడం లేదు.ఉద్యోగాలలో సగటు వేతన పెరుగుదల కేవలం 3-5% మాత్రమే ఉండగా, ద్రవ్యోల్బణం 7-10% పెరిగింది.దీని వల్ల నిజమైన ఆదాయం తగ్గిపోతుంది, అంటే ఉద్యోగస్తులకు పెరిగిన వేతనంతోనూ జీవిత ఖర్చులను సమతుల్యం చేసుకోవడం కష్టమవుతుంది.కొత్త ఉద్యోగావకాశాలు తగ్గిపోతూ ఉన్నాయి. ప్రైవేట్ రంగంలో నియామకాలు మందకొడిగా మారాయి.ప్రభుత్వ ఉద్యోగాలు తగ్గిపోవడంతో స్థిరమైన ఆదాయం పొందే అవకాశాలు తగ్గిపోతున్నాయి. దీనికి తోడు ప్రత్యక్ష పన్నుల్లో రాయితీలు కనిపించినా పరోక్ష పన్నుల భారం మాత్రం మధ్యతరగతి ప్రజలకు తప్పడం లేదు.

అప్పులు పెరగడం కూడా ఒక ముఖ్య కారణంగా పరిగణించవచ్చు. ఇండ్లు కొనుగోలు చేయడం మధ్యతరగతి ప్రజలకు పెద్ద స్వప్నం. కానీ, రియల్ ఎస్టేట్ ధరలు అధికంగా పెరగడంతో ఇంటిని కొనడం చాలా కష్టంగా మారింది.ఇంట్రెస్ట్ రేట్లు పెరగడం వల్ల హౌసింగ్ లోన్ ఈ ఎం ఐ లు పెరిగాయి. ప్రైవేట్ కాలేజీల ఫీజులు అధికంగా ఉండటంతో విద్యా రుణాలు తీసుకునే వారి సంఖ్య పెరిగింది.మంచి ఉద్యోగం రాకపోతే, ఈ రుణ భారం కుటుంబాలకు తలనొప్పిగా మారుతోంది. ఖర్చులు ఎక్కువ కావడం, ఆదాయం తగ్గిపోవడం వల్ల మధ్యతరగతి ప్రజలు క్రెడిట్ కార్డులపై ఆధారపడుతున్నారు. క్రెడిట్ కార్డుల వడ్డీ రేట్లు 24-36% ఉండటంతో అవి చెల్లించలేక అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఆదాయం అంతకంతకూ ఖర్చులకు సరిపోవడం కష్టంగా మారుతోంది. దీనివల్ల పొదుపు చేసుకునే సామర్థ్యం తగ్గిపోతోంది.2010-11లో గరిష్ట స్థాయిలో 35% పొదుపు ఉండగా, ఇప్పుడు ఇది 20% కంటే తక్కువకు పడిపోయింది. బ్యాంక్ ఫిక్స్ డిపాజిట్లపై వడ్డీ రేట్లు తగ్గిపోయాయి.స్టాక్ మార్కెట్ లేదా మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులు పెట్టడం చాలా మందికి ప్రమాదకరంగా అనిపిస్తోంది.అందువల్ల మధ్యతరగతి ప్రజలు ఎక్కువ పొదుపు చేయలేకపోతున్నారు. ఇక ధనికుల విషయానికి వస్తే ధనికులు అధిక లాభాలను సంపాదించే వ్యాపారాలలో పెట్టుబడులు పెట్టడంతో, వారి సంపద వేగంగా పెరుగుతోంది.స్టాక్ మార్కెట్, బిట్కాయిన్, రియల్ ఎస్టేట్ వంటి ఖరీదైన పెట్టుబడుల్లో ధనికులు ఎక్కువగా పెట్టుబడి పెడుతున్నారు. కంపెనీలకు కార్పొరేట్ ట్యాక్స్ తగ్గించడంతో, వారి లాభాలు పెరిగాయి.

మధ్యతరగతి ప్రజలు ద్రవ్యోల్బణం, పెరిగిన పన్నులు, తక్కువ వేతన పెరుగుదల, అధిక రుణ భారం, పొదుపు తగ్గిపోవడం వంటి కారణాల వల్ల ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు.పెరుగుతున్న ఖర్చులను సమతుల్యం చేసుకోవడానికి అదనపు ఆదాయ మార్గాలను అన్వేషించడం, పొదుపును పెంచుకోవడం, వ్యయాలను తగ్గించడం అనివార్యం. ప్రభుత్వ విధానాలు మధ్యతరగతి ప్రజలకు మరింత అనుకూలంగా మారాల్సిన అవసరం ఉంది.ఈ పరిస్థితులు మారకపోతే, మధ్యతరగతి ప్రజలు మరింత ఆర్థిక ఒత్తిడికి గురికావచ్చు!

# ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో సంస్కరణలు జరిగేనా!


కనుమ ఎల్లారెడ్డి
93915 23027


- ఇంత వరకు శాశ్వత సభ్య దేశంగా 6 వ దేశం ఏదీ చేరలేదెందుకు
- భారత్ చేరికకు అడుగడుగునా చైనా, పాక్ అడ్డంకులు
- తన ప్రాభవం కోల్పోతాననే భయ పడుతున్న చైనా
- ఆసియాలో నాదే పెత్త నం సాగాలి అనే ఆశ ఆదేశానిది
- దాయాది దేశంగా భారత్ ఎదుగదలను సహించలేని పాక్




1945 అక్టోబర్ 24 న ఏర్పడిన ఐక్యరాజ్య సమితి లో, సమితి ఏర్పడిన నాటి నుంచి కేవలం ఐదు దేశాలు మాత్రమే శాశ్వత సభ్యత్వం కలిగి ఉన్నాయి. దాదాపు సమితి ఏర్పడి 80 సంవత్సరాలు అవుతున్న ఇంత వరకు శాశ్వత సభ్య దేశంగా 6 వ దేశం ఏదీ చేరక పోవడం శోచనీయం. ఐక్యరాజ్య సమితిలో కనీసం 10 దేశాలకయినా శాశ్వత సభ్యత్వం ఉండాలి. అగ్ర రాజ్యం ఈ విషయంలో చొరవ చూపాలి. ఐక్యరాజ్య సమితి మొత్తం అమెరికా చుట్టే తిరుగుతూ ఉంటుంది. అమెరికా తలచు కుంటే 6 వ, 7 వ దేశాలుగా భారత్ మరియు దక్షిణాఫ్రికా సిద్ధంగా ఉన్నాయి.మిగతా దేశాల మాటేమో కాని భారత్ చేరిక పై ప్రయత్నాలు జరుగుతున్న, తెరపై పేరు వచ్చినా కొన్ని రాజకీయాలు పొడచూపడం, ముఖ్యంగా చైనా, పాక్ అడ్డు పడటం తెలిసిందే. చైనా తన ప్రాభవం కోల్పోతాననే భయం తో ఉన్నట్లు కనిపిస్తోంది. పొరుగున ఉన్న పాక్ కు భారత్ కు శాశ్వత సభ్యత్వ విషయం సహింప లేదు. ఆది భారత్ చేరకుండా రాజకీయం చేస్తుంది. ఆసియాలో నాదే పెత్త నం సాగాలి అనే ఆశ చైనా కు ఉంది. భారత్ చేరితే తన వాణి బొంగురు పోతుందని దాని భయం. రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ భారత్ ను ఆహ్వానిస్తాయి. రష్యా మాత్రం భారత్ చేరిక కు ఎప్పటికి మద్దతు ఉండనే ఉంటుంది. ఎన్నో సార్లు భారత్ భద్రతా మండలిలో చేరాలి అని ఊటంకించింది. భారత్ చేరిక గతంలో ట్రంప్ అధికారం లో ఉన్నపుడే జరగాల్సింది. ట్రంప్ ఇప్పుడు మరోసారి అమెరికా అధ్యక్షుడిగా ఉన్నారు కనుక 6 వ దేశంగా భారత్ చేరాలి అనే ప్రకటన చేయాలి. ఇప్పటికే ఎన్నో సంస్కరణలు చేస్తున్న ట్రంప్ భద్రతా మండలిని కూడా ప్రక్షాళన చేయాలి. ట్రంప్ మాట అన్ని దేశాలు శిరసా వహిస్తాయి. చైనా కొంచెం తాటాకు శబ్దాలు చేసినా ఆది ట్రంప్ ముందు పారదు.

ఉక్రైన్ కు, హమాస్ కు కాల్పుల విరమణ ఆగాలి. శాంతి కొసం మనం ప్రయత్నం చేయాలి అని ట్రంప్ ఉద్దేశంగా ఉంది. ఆ దిశలో ప్రయత్నాలు చేసినా, హమాస్ పెడ చెవిన పెడుతోంది. ఉక్రైన్ పూర్తిగా అమెరికా అదుపు, ఆజ్ఞలో ఉంది. ట్రంప్ మాట వినక పోతే ఇక హమాస్ కొన్ని చిక్కులు ఎదురుకొక తప్పదు. ఆది తెలిసే ఉక్రైన్ అధ్యక్షుడు జెలెన్ స్కి అమెరికా చెప్పినట్లు నడుచుకునే స్థాయి కి వచ్చాడు. ఇక్కడ రష్యా కూడా ట్రంప్ చెప్పినట్లు కాల్పుల విరమణ ఆపాలి.రెండు దేశాలు కూడా విశ్వం లోనే పెద్దవిగా ఉన్నాయి. మరియు భద్రతా మండలిలో శాశ్వ త సభ్య దేశాలు. ట్రంప్ రష్యా వైపే మొగ్గు చూపుతున్నారు. చిన్న దేశమైన ఉక్రైన్ అభివృద్ధి చెందాలన్నా, మౌలిక వసతులు సమకుర్చుకోవాలన్న , అమెరికా అండ ఎప్పటికి ఉండాలన్నా అమెరికా చెప్పినట్లు నడచుకోవాలి. అదే ఉక్రైన్ దేశానికి ఉత్తమం. దేశాలు ఏకమైన అమెరికాను ఏమి చేయలేవు. ఊరికే మాటలు దాడి తప్పితే ఏమి, ఏదీ ఏ దేశానికి చేత కాదు. అమెరికా చెప్పి చూస్తుంది. మాట వినక పోతే ఇక ఆ దేశానికి చుక్కలే. సుంకలా విషయం ఆయా దేశాల వాణిజ్య సంబంధం. దేశ రక్షణ విషయంలో మాత్రం అమెరికా తన మార్క్ చూపిస్తుంది. కనుక భద్రతా మండలిలో ఇక దేశాలు రాజకీయాలు ప్రక్కన పెట్టాలి.

అమెరికా చొరవ తీసుకుంటేనే భారత్ కు మార్గం సుగమం కావొచ్చు. ట్రంప్, మోదీ ఇద్దరూ స్నేహితులు కనుక భారత్ చేరికకు ఏ దేశం అడ్డు చెప్పే సాహసం చేయదు. ఒక వేళ ఏ దేశమైనా అడ్డు చెబితే అమెరికా సహించదు. భద్రతా మండలిని సంస్కరించడం ట్రంప్ తోనే సాధ్యం. అన్ని హంగులు భారత్ కు ఉన్నా భద్రతా మండలి లో రాజ్యాల అనైక్యత తో చర్చకు వచ్చి మరుగున పడింది. ట్రంప్ రావడంతో 6 వ దేశం భారత్ చేరికకు ఏ డోకా ఉండదు. ట్రంప్ అధ్యక్ష పదవి నుంచి దిగిపోయే లోపు భారత్ ను భద్రతా మండలిలో 6 వ దేశంగా చేరుస్తాడని నమ్ముదాం, రాబోయే కొద్ది నెలల లో కాని రెండు, మూడు సంవత్సరాల లో కాని భారత్ ఖచ్చితంగా భద్రతా మండలిలో శాశ్వ త సభ్య దేశంగా చేరుతుందని ఆశిద్దాం.

# టిటిడి వద్దు వైటిడి ముద్దు



తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) కు వెళ్లి అనేక ఇబ్బందులను ఎదుర్కోనేకంటే తెలంగాణ రాష్ట్రంలోని యాదగిరి గుట్ట దేవస్థానం (వైటిడి) లో దేవుని దర్శించుకోవడం మేలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనడం సమంజసం గానే ఉన్నది.తిరుమలకు ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి వెళ్లిన భక్తులకు అక్కడి సిబ్బంది సరైన సమాచారం ఇవ్వకపోవడం, భక్తులతో దురుసుగా ప్రవర్తించడం, ఏమి అడిగినా నిర్లక్ష్యంతో సమాధానం చెప్పడం చేస్తున్నారు.కలియుగ దైవం ఆపద మొక్కల వాడు శ్రీ వేంకటేశ్వర స్వామి దర్శనం కోసం భక్తులను కంపార్ట్ మెంట్ లలో వేసి గంటల తరబడి నిరిక్షించేటట్లు చేస్తున్నారు.ముఖ్యంగా శనివారం నాడు సెలవు దినాలలో 24 గంటలకు పైగా కంపార్ట్ మెంట్ లలో సంధిస్తున్నారు.తీరా శ్రీ వేంకటేశ్వర స్వామి ని తనివితీరా చూడకుండానే ఇద్దరు, ముగ్గురు బలవంతంగా తోసేస్తున్నారు.అన్యమతస్తులను పరమ పవిత్రమైన తిరుమల తిరుపతి దేవస్థానం లో సిబ్బంది గా నియమించడం వలన ఒక వర్గం సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు తెలియక దూర దూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు నరకం చూపిస్తున్నారు.

అక్కడ దుకాణాల యజమానులు ఎక్కువ మొత్తంలో వస్తువులను విక్రయిస్తు దోపిడీ చేస్తున్నారు.మన పొరుగు రాష్ట్రమైన, తెలుగు రాష్ట్ర మైన ఆంధ్రప్రదేశ్ లో గల తిరుమల తిరుపతి దేవస్థానం లో తమిళనాడు చెందిన తమిళ సోదరుల ప్రభావమే ఎక్కువగా ఉంటుంది.భాష ప్రతిపాదికన ఏర్పాటు అయిన ఆంధ్రప్రదేశ్ ఏర్పడి డెభై సంవత్సరాలు కావొస్తున్న ఇంకా తమిళ సోదరుల పెత్తనం, తమిళ సోదరుల పెత్తనం నడుస్తుంది.

తెలంగాణ రాష్ట్రం లో యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి, స్వర్ణగిరి లోని శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం

శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, ఇంకా అనేక దేవుళ్ళ,దేవతల విగ్రహాలు ఎంతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు.భద్రాది శ్రీ సీతారాముల దేవాలయం, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర శివాలయం,బద్ది పోచమ్మ, చెరువు గట్టు, బిర్లా మందిరం,సంఘీ వేంకటేశ్వర స్వామి దేవాలయం, కోటి లింగాలు, ధర్మపురి,బాసర సరస్వతి అమ్మవారు, వర్గల్ సరస్వతి దేవాలయం,మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా లోని కీసరగుట్ట, జోగులాంబ శక్తిపీఠం,తుప్రాన్ నరసింహ స్వామి దేవాలయం, మహబూబ్ నగర్ జిల్లాలోని మన్నెంకొండ వేంకటేశ్వర స్వామి దేవాలయం, కాశి బుగ్గ శివాలయం,సలేశ్వరం ఇంకా అనేక శివాలయంలు, సాయిబాబా దేవాలయాలు ఇంకా అనేక దేవాలయాలు ఇంకా అనేక దేవాలయాలు ఉన్నాయి.భక్తులు మన దేశ తో పార్లమెంటు సభ్యులు ( లోక్ సభ,రాజ్యసభ )

తెలంగాణ రాష్ట్ర మంత్రులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ సభ్యులు తిరుమల తిరుపతి దేవస్థానం జాయింట్ ఎక్జిక్యూటివ్ ఆఫీసర్ కు సిఫారసు ఉత్తరాలు (రికమండేషన్ లేటర్) రాసి ఇస్తే అవి నడవవని నిర్మోహమాటంగా తిరస్కరిస్తున్నారు.300 రూపాయల దర్శనం కానీ, ఇంకా ఏదైనా స్పెషల్ దర్శనం కానీ,సేవల టిక్కెట్లు కానీ 10 వేలఫ రూపాయలు పెట్టి శ్రీవాణి దర్శనం కాని చేసుకుందామనుకుంటే ఇక్కడ ఏ టిక్కెట్లు దొరకవు అన్ని ఆన్ లైన్ లోనే అందుబాటులో ఉంటాయని అంటున్నారు. 300 రూపాయల టిక్కెట్లు రెండు, మూడు నెలల ముందు రిలీజ్ చేస్తున్నారు.కంప్యూటర్, ఇంటర్నెట్, సాంకేతిక పరిజ్ఞానం ఉన్న యువతీ, యువకులు ఆన్ లైన్ లో బుక్ చేసుకుంటున్నారు. కంప్యూటర్, ఇంటర్నెట్, సాంకేతిక పరిజ్ఞానం లేని వృద్ధులు, నిరక్షరాస్యులు, గ్రామాలలో నివసించే భక్తులు తిరుమల తిరుపతి దేవస్థానము టికెట్ల కోసం అష్ట కష్టాలు పడుతున్నారు.

తిరుమల తిరుపతి దేవస్థానం అనగానే "లడ్డూ "కు చాలా ప్రసిద్ధి.తిరుమల తిరుపతి కి వెళ్ళిన తరువాత దేవుని దర్శనం కాకపోయినా " లడ్డూ" కొందామనుకుఃటే దర్శనం కానిది " లడ్డూ 'విక్రయించే ప్రసక్తే లేదని ఖరాఖండిగా చెప్తూ" లడ్డూ, అమ్మడం లేదు.తిరుమల తిరుపతి ఏడుకొండలు నడిచి ఎక్కిన భక్తులకు ప్రత్యేక ప్రాధాన్యత ఇచ్చేవారు.ఇప్పుడు నడిచి వచ్చిన భక్తులకు ఉచిత దర్శనం చేసుకోవాలి అని ఉచితంగానే సలహాలు, సూచనలు ఇస్తున్నారు.

తెలంగాణ రాష్ట్రం లోని 33 జిల్లాల భక్తులు తెలంగాణ రాష్ట్రంలోని యాదాద్రి, భద్రాద్రి, సిరిసిల్ల, జోగులాంబ, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల్లోని దేవాలయాల దేవుళ్ళను దర్శించుకొని మానసిక ప్రశాంతత పొందాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు, తెలంగాణ రాష్ట్ర క్యాబినెట్ మంత్రులు, దేవాలయ ధర్మాదాయ శాఖ అధికారులకు ప్రజలు కోరుతున్నారు.తెలంగాణ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రజల మనోభావాలను దెబ్బ తీయడం గాని ఆత్మ గౌరవం దెబ్బ తీయడం గాని చేశారనడంలో అర్థం లేదు.తెలంగాణ ప్రజలు తిరుమల తిరుపతి దేవస్థానం కు వెళ్లి ఇబ్బందులను ఎదుర్కొనకుండా తెలంగాణ రాష్ట్రంలోని దేవాలయాలు దర్శించుకోవాలని చెప్పడం సంతోషించదగిన, అభినందనీయమైన విషయం

డాక్టర్. ఎస్. విజయ భాస్కర్., 9290826988



పాఠకులు, విశ్లేషకులు, రచయితలు తమ రచనలు క్రింది చిరునామాకు గానీ సూర్య దినపత్రిక ఎడిటోరియల్ మెయిల్ ఐడికి గాని పంపవలసినదిగా మనవి మెయిల్ :

editpage@suryaa.com
features@suryaa.com

SPR publications, Surya Soudha, Plot.No: 185, M.C.H. NO.258/1/185, siddi vinayaka nagar, Ayyappa Society Opp: Hi-Tech City, Hyderabad - 500 072.

# శశిథరూర్ సెల్ఫీ కలకలం

● బీజేపీ ఎంపీతో కలిసి జర్నీ ● ఇటీవల సొంత పార్టీ వైఖరికి భిన్నంగా వ్యాఖ్యలు ● నరేంద్ర మోదీ, కేరళ వామపక్ష ప్రభుత్వంపై ప్రశంసలు



న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత, తిరువనంతపురం ఎంపీ శశిథరూర్‌కు, ఆ పార్టీ అధినాయకత్వానికి మధ్య దూరం పెరిగిందనే ప్రచారం మధ్య తాజాగా ఓ ఫోటో కలకలం సృష్టిస్తోంది. బీజేపీ ఎంపీ జే పాండాతో విమానంలో శశిథరూర్ కలిసి ప్రయాణించారు. ఇద్దరూ కలిసి తీసుకున్న సెల్ఫీ (Selfie)ని సామాజిక మాధ్యమంలో పాండ పోస్ట్ చేశారు. ఎట్టకేలకు ఒకే దిశలో మనం ప్రయాణిస్తున్నట్టు కనిపిస్తోందంటూ నా ఫ్రెండ్, సహ ప్రయాణికుడు చమత్కరించారంటూ పాండ ఆ పోస్ట్‌లో పేర్కొన్నారు. దీంతో సొంత పార్టీ పట్ల అసంతృప్తితో ఉన్న శశిథూరూర్ బీజేపీ వైపు చూస్తున్నారంటూ కొద్దికాలంగా జరుగుతున్న ప్రచారం మరోసారి ఊపందుకుంది.

**థరూర్ స్పందనిదే...** జే పాండేతో సెల్ఫీపై ఊహాగానాలు వెలువడటంతో వెంటనే థరూర్ స్పందించారు. తన సహచర ప్రయాణికుడు భువనేశ్వర్ వరకూ వెళ్తున్నారని, తాను కళింగ లిటరేచర్ ఫెస్టివల్ లో రేపు ఉదయం ప్రసంగించేందుకు వెళ్తున్నానని చెప్పారు. ఇది యాదృచ్ఛికమేకానీ, ఇందులో ఎలాంటి రాజకీయ సందేశాలు లేవన్నారు.

**ఇదే మొదటిసారి కాదు** శశిథరూర్ సెల్ఫీలతో కలకలం సృష్టించడం ఇదే మొదటిసారి కాదు. కేరళ సీఎం, సీపీఎం నేత పినరయి విజయన్తో లిటరరీ ఈవెంట్లో ఆయన ఫోటో దిగడం, దానిని షేర్ చేయడం గతంలో జరిగింది. మరో ఈవెంట్ లో కేరళలోని ఓ ఆలయంలో బీజేపీ ఎపీ, నటుడు సురేష్ గోపీతో ఆయన కనిపించారు. కాగా, శశిథరూర్ ఇటీవల సొంత పార్టీ వైఖరికి భిన్నంగా వ్యాఖ్యలు చేసిన పలు సందర్భాలు ఉన్నాయి. ప్రధానమంత్రి నరేంద్ర మోదీని, కేరళ వామపక్ష ప్రభుత్వాన్ని ఇటీవల ప్రశంసించారు. మోదీ-ట్రంప్ సమావేశం భారతదేశానికి ప్రయోజనకరంగా ఉంటుందని, చాలా తక్కువ దేశాలకు సాధ్యమయ్యే శాశ్వత శాంతిని తీసుకువచ్చే స్థితిలో ప్రస్తుతం మన దేశం ఉందని శశిథరూర్ కొనియాడారు. ఇవన్నీ బీజేపీకి దగ్గరయ్యేందుకు శశిథరూర్ ఇస్తున్న సంకేతాలు కావచ్చనే ప్రచారం జరుగుతోంది.

# జల సంరక్షణతోనే దేశ సుస్థిర అభివృద్ధి


● ప్రపంచ జల దినోత్సవం సందర్భంగా ప్రధాని మోడీ ● ఈ ఏడాది థీమ్ 'గ్లేసియర్ ప్రిజర్వేషన్' పాటిద్దాం ● ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ప్రభావితం చేస్తున్న తీవ్ర నీటి సంక్షోభం ● నీటి సంక్షోభాన్ని పరిష్కరించడానికి అవగాహన కల్పించడం లక్ష్యం ● హిమానీనదాల కీలక పాత్ర వాతావరణ మార్పులపైనా చర్చ జరగాలి

న్యూఢిల్లీ : నీటిని సంరక్షించడం ద్వారనే దేశం సుస్థిర అభివృద్ధి సాధిస్తుందని ప్రధాని మోడీ తెలిపారు. వుక్రవారం ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నీటిని సంరక్షించడం అంటే సుస్థిర అభివృద్ధిని ప్రోత్సహించడమేనని ఇందులో మన దేశం నిబద్ధత వెరెవ్వరూ ఎత్తి చూపలేరని ప్రధాని నరేంద్ర మోదీ పునరుద్ఘాటించారు. సోషల్ మీడియా ఎక్స్ పోస్ట్‌లో, అతను నీటి సంరక్షణ ప్రాముఖ్యతను హైలైట్ చేస్తూ ఒక వీడియోను పంచుకున్నాడు. నీరు నాగరికతలకు జీవనాధారమని, భవిష్యత్ తరాలకు నీటిని కాపాడుకోవాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

నేడు ప్రపంచ నీటి దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. ఈ రోజు మంచినీటి ప్రాముఖ్యతను హైలైట్ చేస్తుంది మరియు నీటి వనరుల స్థిరమైన నిర్వహణ కోసం వాదిస్తుంది. ప్రపంచవ్యాప్త నీటి సంక్షోభాన్ని పరిష్కరించడానికి అవగాహన కల్పించడం మరియు చర్యలను ప్రేరేపించడం గ్లోబల్ ఈవెంట్ లక్ష్యం. ఈ వేడుక సస్టైనబుల్ డెవలప్మెంట్ గోల్ 6తో దగ్గరి సంబంధం కలిగి ఉంది, ఇది 2030 నాటికి అందరికీ నీరు మరియు పారిశుద్ధ్యాన్ని అందించాలనే లక్ష్యంతో ఉందన్నారు.

ఈ సంవత్సరం ప్రపంచ నీటి దినోత్సవం యొక్క థీమ్ 'గ్లేసియర్ ప్రిజర్వేషన్', ఇది ప్రపంచ మంచినీటి సరఫరాలను నిర్వహించడంలో హిమానీనదాల యొక్క కీలక పాత్రను మరియు వాతావరణ మార్పుల నేపథ్యంలో పరిరక్షణ చర్యల యొక్క తక్షణ అవసరాన్ని నొక్కి చెబుతుంది.

ప్రపంచ నీటి దినోత్సవం 1992లో బ్రెజిల్‌లోని రియో డి జనీరోలో పర్యావరణం మరియు అభివృద్ధిపై ప్రపంచ సంస్థ సమావేశాన్ని నిర్వహించినప్పుడు ఐక్యరాజ్య సమితిచే స్థాపించబడింది. ఈ సమావేశంలో, అధికారికంగా మార్చి 22వ తేదీని ప్రపంచ నీటి దినోత్సవంగా పేర్కొంటూ ఒక తీర్మానాన్ని ఆమోదించారు. ఈ రోజు యొక్క మొదటి ఆచారం 1993



మార్చి 22న జరిగింది, ఇది వార్షిక ప్రపంచ చొరవకు నాంది పలికింది. ప్రపంచ నీటి దినోత్సవం యొక్క ప్రధాన లక్ష్యం మన గ్రహం మీద నీటి ప్రాముఖ్యతను గుర్తించడం. వేడుకలకు మించి, ప్రపంచవ్యాప్తంగా మిలియన్ల మందిని ప్రభావితం చేస్తున్న తీవ్రమైన నీటి సంక్షోభాన్ని హైలైట్ చేయడానికి ఇది ఒక వేదికగా పనిచేస్తుంది. ప్రస్తుతం, దాదాపు 2.2 బిలియన్ల మందికి స్వచ్ఛమైన మరియు సురక్షితమైన త్రాగునీరు అందుబాటులో లేదు.

నీటి సంరక్షణపై అవగాహన కల్పించేందుకు దేశవ్యాప్తంగా మరియు ప్రపంచవ్యాప్తంగా అనేక కార్యక్రమాలు వరుసలో ఉన్నాయి.

# ట్రంప్ కోసం పుతిన్ ప్రార్థనలు

### గతేడాది ఎన్నికల ప్రచారంలో ట్రంప్‌పై హత్యాయత్నం




మాస్కో: రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ముగింపు కోసం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. రష్యాకు అనుకూలంగా ఆయన ప్రకటనలు, నిర్ణయాలు ఉంటున్నాయి. ఈ తరుణంలో వారి స్నేహం గురించి ఓ ఆసక్తికర విషయం వెలుగులోకి వచ్చింది

గత ఏడాది ఎన్నికల ప్రచారంలో భాగంగా ట్రంప్‌పై హత్యాయత్నం జరిగిన సంగతి తెలిసిందే. పెన్సిల్వేనియాలో ప్రచారంలో ఉండగా 20 ఏళ్ల యువకుడు జరిపిన కాల్పుల్లో.. ట్రంప్ చెవికి స్వల్పంగా గాయమైంది. భద్రతా సిబ్బంది వెంటనే ట్రంప్ చుట్టూ రక్షణగా చేరి.. వేదికపైనుంచి దించి ఆస్పత్రికి తరలించారు. ఆ ఘటన అప్పట్లో సంచలనమైంది. ఆ విషయం తెలుసుకున్న రష్యా అధ్యక్షుడు పుతిన్.. ట్రంప్ క్షేమం కోసం ప్రార్థనలు చేశారు. "పుతిన్ స్థానిక చర్చ్కు వెళ్లి, మత గురువును కలిసి, అధ్యక్షుడి కోసం ప్రార్థించారు. అధ్యక్షుడితో పుతిన్కు స్నేహం ఉంది. స్నేహితుడి కోసం ఆయన ప్రార్థించారు. ఇదే విషయాన్ని నేను ట్రంప్ నకు చెప్పాను. పుతిన్ చర్య ఆయన హృదయాన్ని హత్తుకుంది" అని అమెరికా రాయబారి స్టీవ్ విట్ కోఫ్ ఓ పాడ్‌కాస్ట్‌లో భాగంగా వెల్లడించారు.

గత ఏడాది ట్రంప్‌పై వరుసగా జరిగిన హత్యాయత్న ఘటనలపై గతంలో పుతిన్ స్పందించారు కూడా. "అమెరికా చరిత్రలోనే ఈసారి దురదృష్టకర ఘటనలు చోటుచేసుకున్నాయి. ఎన్నికల్లో ట్రంప్ పై పోరాడేందుకు కొందరు అనాగరిక పద్ధతులు పాటించారు. ఆయన కుటుంబాన్ని, పిల్లలను లక్ష్యంగా చేసుకొని రాజకీయ ప్రత్యర్థులు విమర్శలు గుప్పించడం దిగ్భ్రాంతి కలిగించింది. పలుమార్లు ఆయనపై హత్యాయత్నాలు జరగడం విచారకరం. నా అంచనా ప్రకారం.. ఇప్పుడు ట్రంప్ ఏమాత్రం సురక్షితంగా లేరు. అయితే ఆయన తెలివైన వ్యక్తి. ముప్పును అర్థం చేసుకొని జాగ్రత్తగా ఉంటారని విశ్వసిస్తున్నా" అని అన్నారు.

# "మన బలం తగ్గే ప్రమాదం"

### డీలిమిటేషన్‌పై స్టాలిన్ హెచ్చరిక



చెన్నై: "జనాభా ఆధారంగా డీలిమిటేషన్ చేస్తే, మన స్వదేశంలోనే మనమే రాజకీయ అధికారాన్ని కోల్పోయినవారిగా మారిపోతాం" అని తమిళనాడు సీఎం స్టాలిన్ తీవ్రంగా హెచ్చరించారు. డీలిమిటేషన్‌కు వ్యతిరేకంగా చెన్నైలో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, దక్షిణాది రాష్ట్రాల హక్కుల పరిరక్షణకు ఇది ఒక చారిత్రక ముందడుగు అవుతుందని పేర్కొన్నారు. ప్రస్తుత జనాభా లెక్కల ప్రకారం డీలిమిటేషన్ జరిగితే, పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాల ప్రాతినిధ్యం తగ్గే అవకాశముందని, ఇది నైతికంగా తప్పని ఆయన స్పష్టం చేశారు. మన సమ్మతి లేకుండా చట్టాలు తయారయ్యే పరిస్థితి వస్తుందని,మన అభిప్రాయాల బలం తగ్గిపోతుందని స్టాలిన్ ఆవేదన వ్యక్తం చేశారు. జనాభా నియంత్రణలో దక్షిణాది రాష్ట్రాలు ముందుండడంతో ప్రస్తుతం అక్కడ జనాభా పెరుగుదల తక్కువగా ఉందని,ఇది ఇప్పుడు ప్రతికూలంగా మారుతుందనడం దుర్మార్గమని స్టాలిన్ అభిప్రాయపడ్డారు. ఉత్తరాదిన జనాభా పెరుగుదల అధికంగా ఉండటంతో వారికే అధిక ప్రాతినిధ్యం లభించడమంటే దక్షిణం అన్యాయాన్ని ఎదుర్కోవాల్సిందేనన్నారు. విద్య, నిధులు, ఉద్యోగాలు, సామాజిక న్యాయం వంటి అంశాలపై ప్రభావం పడేలా రాజకీయ ప్రాతినిధ్యానికి ముప్పు తలెత్తుతుందని స్టాలిన్ హెచ్చరించారు. డీలిమిటేషన్ లాంటి కీలక అంశంపై దక్షిణ రాష్ట్రాలన్నీ ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

# ట్రంప్ 'గోల్డ్ కార్డ్'కు ఫుల్ డిమాండ్

● ఒక్క రోజే 1000 సేల్ ● 5 ట్రిలియన్ డాలర్లు సేకరించే ఛాన్స్!

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల ప్రకటించిన 'గోల్డ్ కార్డు'కు భారీ గిరాకీ ఉన్నట్లుగా తెలుస్తోంది. ఒక్కరోజే 1000 కార్డులను విక్రయించినట్లు అమెరికా వాణిజ్యశాఖ మంత్రి హెూవర్డ్ లుట్నిక్ వెల్లడించారు. వీటి ద్వారా 5బిలియన్ డాలర్లు సేకరించామని ఓ పాడ్ కాస్ట్ లో చెప్పారు. అంతేకాకుండా లక్షలాది మంది ఈ కార్డును కొనేందుకు సిద్ధంగా ఉన్నారని, వీటిద్వారా 5 ట్రిలియన్ డాలర్లు సేకరించే అవకాశం ఉందని పేర్కొన్నారు.

'ప్రపంచ వ్యాప్తంగా 3.7 కోట్ల మందికి ఈ గోల్డ్ కార్డు కొనే సామర్థ్యం ఉంది. కనీసం 10లక్షల మందైనా ఈ కార్డును కొనుగోలు చేస్తారని అధ్యక్షుడు ట్రంప్ భావిస్తున్నారు. అసలు ఈ కార్డును తీసుకురావలనే ఆలోచన ట్రంప్ నుంచి వచ్చినదే. అధ్యక్షుడి ఆలోచనను అమలు చేయడమే మా బాధ్యత. దీన్ని అమలు చేసే ప్రణాళిక మా వద్ద ఉంది' అని లుట్నిక్ పేర్కొన్నారు.

**ఇన్వెస్టర్ వీసాతో మోసాలు**

ప్రస్తుతం ఉన్న ఇన్వెస్టర్ వీసా ఈబీ-5 స్థానంలో ఈ గోల్డ్ కార్డు తీసుకురానున్నట్లు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఇటీవల ప్రకటించారు. 5 మిలియన్ డాలర్లు చెల్లించగలిగే వారికి నేరుగా అమెరికా పౌరసత్వాన్ని అందజేస్తారని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న సంపన్నులను ఆకర్షించేందుకే దీనిని ప్రవేశపెట్టామని తెలిపారు. వారంతా అమెరికాకు వచ్చి భారీగా ఖర్చుపెడితే స్థానికంగా ఉద్యోగాలు కూడా పెరుగుతాయని డొనాల్డ్ ట్రంప్ అప్పుడు పేర్కొన్నారు. ఇదే విషయంపై ఇటీవల లుట్నిక్ కూడా మాట్లాడారు. సుమారు 2.5లక్షల మంది ఈ గోల్డ్ కార్డు కొనేందుకు ఆసక్తి




చూపుతున్నట్లు తెలిపారు. EB-5 ప్రోగ్రామ్ వల్ల జరుగుతున్న మోసాలు, ఇతర అక్రమాలను అరికట్టేందుకు వీటిని తీసుకొస్తున్నామని అన్నారు. చట్టబద్ధ ఇన్వెస్టర్లకు పౌరసత్వం, శాశ్వత నివాసం కల్పించేందుకు ఇది ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.

ఈబీ-5 వీసా విధానాన్ని అమెరికా 1990లో తీసుకొచ్చింది. వేలాది మంది ఈ ఇన్వెస్టర్ వీసాలను పొందారు. అయితే, ఈ విధానంతో మోసాలు జరుగుతున్నాయని, కొందరు అక్రమంగా నిధులు పొందుతున్నారని ఓ అధ్యయనంలో తేలింది.

దీంతో 2022లో కొన్ని సవరణలు చేశారు. తాజాగా దీని స్థానంలో గోల్డ్ కార్డును ప్రవేశపెడుతున్నట్లు ట్రంప్ వెల్లడించారు.

# అల్లర్లకు పాల్పడిన వారి నుంచే ఆస్తి నష్టం వసూలు

● డబ్బులు చెల్లించని పక్షంలో వారి ఆస్తుల స్వాధీనం ● సీఎం దేవేంద్ర ఫడ్నవిస్



ముంబై: మహారాష్ట్రలోని నాగపూర్‌లో మార్చి 17న చెలరేగిన అల్లర్లలో పెద్దఎత్తున ఆస్తినష్టం, రాళ్లదాడులు, వాహనాలకు నిప్పుపెట్టిన ఘటనలపై ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ ఘాటుగా స్పందించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్ సమక్షంలో పోలీసు ఉన్నతాధికారులతో జరిపిన సమావేశానంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, హింసకు కారణమైన వారి నుంచి ఆస్తి నష్టం మొత్తాన్ని వసూలు చేస్తామని చెప్పారు. వారు డబ్బులు చెల్లించని పక్షంలో వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని విక్రయిస్తామన్నారు. హింసాకాండ ఘటనల్లో పోలీసులపై దాడికి దిగిన వారిని కఠినంగా శిక్షిస్తామని చెప్పారు.

సీసీటీవీ ఫుటేజ్, వీడియో రికార్డులను విశ్లేషించి 104 మంది నిందితులను గుర్తించామని, 92 మందిపై ఇప్పటికే చర్యలు ప్రారంభించామని సీఎం తెలిపారు. వీరిలో 12 మంది మైనర్లు కూడా ఉన్నారని చెప్పారు. 1992 తర్వాత ఇలాంటి ఘటనలేవీ చోటుచేసుకోలేదనీ, పోలీసులపై దాడికి దిగిన వారినెవ్వరినీ విడిచిపెట్టమని చెప్పారు. అల్లర్లు చెలరేగిన 4-4.5 గంటల్లోనే పోలీసులు పరిస్థితిని అదుపు చేశారని, అయితే డీసీపీ స్థాయి అధికారితో సహా పలువురు పోలీసులు గాయపడ్డారని తెలిపారు.

అల్లర్లలో బంగ్లాదేశీయుల హస్తం ఉందా అనే విషయంపై అడిగినప్పుడు, ప్రస్తుతం దీనిపై ఏమీ చెప్పలేమని, దర్యాప్తు కొనసాగుతోందని ఫడ్నవిస్ తెలిపారు. దీని వెనుక ఎవరు ఉన్నా కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు.

# హైదరాబాద్‌లో డీలిమిటేషన్‌పై జేఏసీ తదుపరి భేటీ



న్యూఢిల్లీ: నియోజక వర్గాల పునర్విభజనపై తమ వాణిని బలంగా వినిపించేందుకు దక్షిణాది రాష్ట్రాలు ఉమ్మడి కార్యాచరణకు దిగాయి. ఇందులో భాగంగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ నేతృత్వంలో చెన్నైలో శనివారం నాడు తొలి జేఏసీ (JAC) సమావేశం జరిగింది. దీనికి కొనసాగింపుగా తదుపరి జేఏసీ సమావేశం హైదరాబాద్లో ఉంటుందని స్టాలిన్ ప్రకటించారు. చెన్నైలో జరిగిన జేఏసీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ప్రతిపక్ష బీఆర్ఎస్ నేత కేటీఆర్, కేరళ సీఎం పినరయి విజయన్, పంజాబ్ సీఎం భగవంత్ మాన్, కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా, టీఎంసీ అధినేత్రి, పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఈ సమావేశానికి హాజరుకాలేదు. అయితే ముందస్తు కార్యక్రమాల కారణంగా తాను హాజరు కాలేకపోతున్నానని, డీలిమిటేషన్‌పై దక్షిణాది రాష్ట్రాల ఉమ్మడి కార్యాచరణకు తన మద్దతు ఉంటుందని ఒక లేఖ రాశారు. ఆ లేఖను జేఏసీ సమావేశంలో చదివి వినిపించారు. బీజేడీ, సీపీఐ, ఐయూఎంఎల్, మరికొన్ని ప్రాంతీయ పార్టీల ప్రతినిధులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి భాగస్వామిగా ఉన్న పవన్ కల్యాణ్ సారథ్యంలోని శివసేన పార్టీ తమ ప్రతినిధులను ఎవ్వరినీ పంపలేదు.

### సికింద్రాబాద్ డివిజన్‌లోని కరీంనగర్ - రామగుండం - వరంగల్ - కాజీపేట సెక్షన్‌ను

# తనిఖీ చేసిన దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ ఈరోజు అనగా మార్చి 21, 2025న సికింద్రాబాద్ డివిజన్ లోని కరీంనగర్ - రామగుండం - వరంగల్ - కాజీపేట సెక్షన్‌ను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆయనతో పాటు సికింద్రాబాద్ డివిజన్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్ మరియు ప్రధాన కార్యాలయం మరియు డివిజన్ నుండి ఇతర సీనియర్ అధికారులు తనిఖీ అంతటా పాల్గొన్నారు.

అరుణ్ కుమార్ జైన్ కరీంనగర్ రైల్వే స్టేషన్‌లో తనిఖీని ప్రారంభించి, ప్రయాణీకుల సౌకర్యాలు మరియు స్టేషన్ పరిసర ప్రాంగణాన్ని ఆయన సమీక్షించారు. (ఏ.బి.ఎస్.ఎస్.)లో భాగంగా రూ.25.89 కోట్ల వ్యయంతో స్టేషన్లో కొనసాగుతున్న పునరాభివృద్ధి పనుల పురోగతిని కూడా ఆయన సమీక్షించారు. నిర్మాణ పనులు పురోగతిలోనున్నపుడు అనుసరిస్తున్న భద్రతా విధానాలు, మార్గదర్శకాలను ఆయన పరిశీలించారు. కరీంనగర్ నుండి రామగుండం సెక్షన్ వరకు రియర్ విండో తనిఖీలో సిగ్నల్స్ భద్రతా అంశాలు, ట్రాక్ల నిర్వహణను సమీక్షించారు.

రామగుండం రైల్వే స్టేషన్‌ను జనరల్ మేనేజర్ క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ప్రయాణీకుల సౌకర్యాలు, సర్క్యులేటింగ్ ఏరియా, స్టేషన్‌మాస్టర్ కార్యాలయం మరియు స్టేషన్ రికార్డులను ఆయన పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా రూ. 26.49 కోట్ల వ్యయంతో స్టేషన్‌లో చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని కూడా ఆయన సమీక్షించారు. జనరల్ మేనేజర్ వరంగల్ రైల్వే స్టేషన్ను క్షుణ్ణంగా తనిఖీ చేసి, ప్రయాణీకుల సౌకర్యాలు, వెయిటింగ్ హాల్ను సమీక్షించారు. స్టేషన్లోని ప్రయాణికులతో



కూడా సంభాషించారు. స్టేషన్‌లోని రైల్ కోచ్ రెస్టారెంట్ ను కూడా ఆయన సందర్శించి, వినియోగదారులతో సంభాషించారు. ఇంకా, స్టేషన్లో రూ. 25.41 కోట్లతో చేపట్టిన పునరాభివృద్ధి పనుల పురోగతిని ఆయన సమీక్షించారు. నిర్మాణ పనులలో భాగంగా అనుసరిస్తున్న భద్రతా జాగ్రత్తలు, విధానాలను ఆయన పరిశీలించారు.తదనతరం జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్, సీనియర్ అధికారులతో కలిసి కాజీపేటలో సిబ్బందితో భద్రతా సమావేశాన్ని నిర్వహించారు. జనరల్ మేనేజర్ కాజీపేటలో లోకో పైలట్లు, అసిస్టెంట్ లోకో పైలట్లు మరియు లోకో ఇన్స్పెక్టర్లతో సంభాషించి, పనిచేసే పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. భద్రతా మార్గదర్శకాలను పునరుద్ఘాటించారు.

# మన తేజస్‌లకు యూఎస్ ఇంజిన్లు

### శరవేగంగా సరఫరా చేసేందుకు సిద్ధం



న్యూఢిల్లీ: భారత వాయుసేన తీవ్ర ఆందోళన మధ్య తేజస్ యుద్ధ విమానాల తయారీలో కీలక పురోగతి చోటుచేసుకుంది. ఈ ఎయిర్ క్రాఫ్ట్ లకు అమెరిన్ సంస్థ తయారీ ఇంజిన్లను అమర్చుతున్నారు. కానీ.. కొన్నాళ్లుగా ఇండియా-యూఎస్ ఎ మధ్య నెలకొన్న తీవ్ర ఆందోళనల మధ్య ఈ ఇంజిన్ల సరఫరాలో మరింత జాప్యం చోటుచేసుకోవచ్చని అంతా భావించారు. కానీ.. ఈ నెలలోనే తేజస్ యుద్ధ విమానాల్లోకి అవసరమైన అత్యంత శక్తివంతమైన ఇంజిన్లను సరఫరా చేసేందుకు రంగం సిద్ధమైంది. ఈ పరిణామాన్ని భారత్-అమెరికా వాణిజ్య సుంకాలపై ఆందోళనల నేపథ్యంలో భద్రతా రంగంలో చోటుచేసుకున్న పురోగతిగా అభివర్ణిస్తున్నారు. కాగా.. రెండేళ్ల జాప్యం తర్వాత ఆమెరికాకు చెందిన ఎయిర్ క్రాఫ్ట్ ఇంజిన్ తయారీదారు మేజర్ జీఈ..ఈ నెలలో హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ - హాల్‌కి ఆర్డర్ చేసిన 99 జీఈ-404 ఇంజిన్‌లలో మొదటిదాన్ని డెలివరీ చేయనుంది. ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న జిఈ -404 ఇంజిన్లు తేజస్ మార్క్ 1- ఏ ఫైటర్లలో వినియోగిస్తున్నారు. ఈ ఇంజిన్ల రాకలో నెలకొన్న తీవ్ర జాప్యం కారణంగా.. యుద్ధ విమానాల కొరత ఏర్పడుతుందని భారత వైమానిక దళం - ఐఏఎఫ్ తీవ్ర ఆందోళనకు గురవుతోంది. ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందంలో భాగంగా సరఫరా చేయనున్న ఇంజిన్లల్లో మొదటిది ఇప్పటికే పరీక్ష దశలో ఉన్నట్లు చెబుతున్నారు. అన్ని పరీక్షలు పూర్తయిన తర్వాత ఈ నెలాఖరు నాటికి ఈ శక్తివంతమైన ఇంజిన్‌ను డెలివరీ చేయవచ్చని చెబుతున్నారు. కాగా.. 2025 లో మొత్తం 12 ఇంజిన్ల చొప్పున.. ప్రతీ ఏడాది 20 ఇంజిన్లు GE ద్వారా డెలివరీ అవుతాయని హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ అధికారులు భావిస్తున్నారు.

**ఒప్పందం ఏంటి.?**

దేశీయ తయారీ యుద్ధవిమానం అయిన తేజస్ యుద్ధ విమానంలో అమెరికా సంస్థ తయారు చేస్తున్న శక్తివంతమైన ఇంజిన్ వినియోగిస్తున్నారు. ఈ కారణంగానే.. 2021 లో అమెరికన్ డాలర్లు 716 మిలియన్ల డాలర్ల విలువైన ఒప్పందం ఇరు దేశాల మధ్య కుదిరింది. ఇందులో భాగంగా.. హిందుస్థాన్ ఎయిరో నాటిక్స్ - హాల్ సంస్థకు ఇంజిన్ తయారీ సంస్థ 99-ఇంజిన్లను అందించాల్సి ఉంటుంది. అయితే.. డెలివరీలో తీవ్రమైన జాప్యం కారణంగా.. ఇండియన్ ఎయిర్ఫోర్స్ తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఓ వైపు ఇండియన్ ఫైటర్ జెట్ ఇంజిన్ తయారు చేస్తూనే దేశీయంగా ఫైటర్ జెట్ఇంజిన్ తయారీకి ఇండియా ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగా.. భారత్ - యూఎస్ మధ్య.. జాతీయ భద్రతా సలహాదారుల మధ్య క్రిటికల్,ఎమర్జింగ్ టెక్నాలజీల -iCET సాంకేతిక బదిలీ విధానంలో భాగంగా దేశీయంగానే శక్తివంతమైన GE-414 ఇంజిన్‌ను తయారు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఈ పనిని అమెరికాకు చెందిన జీఈ సంస్థతో కలిసి DRDO పని చేస్తోంది. కాగా.. ఈ ఇంజిన్‌ను అధునాతన మల్టీ-రోల్ కంబాట్ ఎయిర్క్రాఫ్ట్ (AMCA)లో వినియోగించాలని చూస్తున్నారు.

**ఇండియన్ ఎయిర్ ఫోర్స్ చీఫ్ అసంతృప్తి**

ఇదిలా ఉండగా.. హిందుస్థాన్ ఎయిరోనాటిక్స్‌కు చెందిన 83 ఎల్‌సిఏ ఎంకె -1ఏ దేశీయ ఫైటర్ జెట్ తేజస్ తయారీ, సరఫరాలో జాప్యంపై ఐఏఎఫ్ చీఫ్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. తనకు హాల్ సంస్థపై నమ్మకం లేదంటూ ఘాటుగానే స్పందించారు. అనేక సందర్భాల్లో తేజస్ యుద్ధ విమానాల అందజేతలోని జాప్యంపై బహిరంగంగానే వ్యాఖ్యలు చేశారు. దీంతో.. కేంద్ర ప్రభుత్వం స్పందించింది. రక్షణ కార్యదర్శి ఆర్ కె సింగ్ అధ్యక్షతన రక్షణ మంత్రిత్వ శాఖ ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసింది. ప్రతిపాదిత ఐదో తరం యుద్ధ విమానాల కోసం వ్యాపార నమూనాను రూపొందించేందుకు ఈ కమిటీ సిఫార్సులు చేయాల్సిందిగా సూచించింది. ఈ కమిటీ అన్ని అంశాలను పరిశీలించి.. ఐదో తరం ఫైటర్ జెట్ అభివృద్ధి, తయారీలో ప్రైవేట్ రంగ భాగస్వామ్యానికి అవకాశం కల్పించాల్సిందిగా సూచించింది. భవిష్యత్తు కోసం, దేశ జాతీయ భద్రతా అవసరాలను తీర్చడానికి యుద్ధ జెట్లను తయారు చేసేందుకు.. ప్రభుత్వ రంగ సంస్థ అయిన హాల్ మాత్రమే కాకుండా ఇతర సంస్థలు పోటీలో ఉండాలని సూచించింది.

# హిడ్మా ఎక్కడ? అమిత్‌షాకు సవాల్

### మోస్ట్ వాంటెడ్ గ్రేట్ ఎస్కేప్

రాయ్‌పూర్ : దండకారణ్యంలో నెత్తురు ఏరులై పారుతోంది. పచ్చని అడువులు ఎర్ర జెండాల రక్తంతో తడిసిపోతున్నాయి. తుపాకీ గొట్టాల గర్జనతో విప్లవం తల్లడిల్లుతోంది. వందలాదిగా మావోయిస్టులు నేలకొరుగుతున్నారు. 80 రోజుల్లోనే 120 మంది మావోయిస్టులు ఎన్ కౌంటర్ లో హతమయ్యారు. ఈ మధ్య కాలంలో ఇదే బిగ్ నెంబర్. అయితే, అడవుల్లో భద్రతా బలగాలు ఎంత గాలిస్తున్నా.. మోస్ట్ వాంటెడ్ మావోయిస్ట్ హిడ్మా మాత్రం తప్పించుకుంటూనే ఉన్నాడు. చిక్కడు, దొరకడు టైప్ లో చుక్కలు చూపిస్తున్నాడు. అబూజ్ మడ్ లో ప్రస్తుతం ఫుల్ యాక్టివ్ గా ఉన్నది హిడ్మానే. అతని కోసమే పోలీస్ వేట. ఎంతగా వెంటాడినా.. కుక్కలు, డ్రోన్లు, హెలికాప్టర్లతో గాలించినా.. ప్రతీసారీ హిడ్మా గ్రేట్ ఎస్కేప్ అవుతున్నాడు. హిడ్మా కోసం ఏకంగా 125 గ్రామాలను పూర్తిగా తమ కంట్రోల్ లోకి తీసుకుని కూంబింగ్ చేస్తున్నాయి ఆర్మ్డ్ ఫోర్సెస్.

**ఇంతకీ హిడ్మా ఎక్కడ?**

ఆపరేషన్ కగార్. సీఆర్పీఎఫ్, కోబ్రా, ప్రత్యేక బలగాలతో స్పెషల్ కూంబింగ్. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా డైరెక్టా డీల్ చేస్తున్నారు. 2026 మార్చి నాటికి దేశంలో మావోయిస్టులే లేకుండా చేస్తామని తేల్చి చెబుతున్నారు. అన్నట్టుగానే అబూజ్ మడ్ లో మావోలను ఏరిపారేస్తున్నారు. ఈ వారంలోనే 30 మందికి పైగా ఎన్ కౌంటర్లో మరణించారు. ఫిబ్రవరిలో 40 మంది.. జనవరిలో 48 మంది ప్రాణాలు కోల్పోయారు. 2024లో ఛత్తీస్ గడ్ లో జరిగిన ఎన్ కౌంటర్స్‌లో ఏకంగా 235 మంది మావోయిస్టులు చనిపోయారు. ఒకప్పుడు 14 రాష్ట్రాల్లో ఉన్న వామపక్ష తీవ్రవాదం ప్రస్తుతం ఛత్తీస్ గడ్ కు మాత్రమే పరిమితమైంది. కేంద్ర కమిటీ, పొలిట్ బ్యూరో టార్గెట్‌గా దండకారణ్యాన్ని జల్లెడ పడుతున్నాయి కేంద్ర బలగాలు.

**హిడ్మా ఉనికిని స్పెషల్ ఫోర్సెస్ పసిగట్టాయా? :** దండకారణ్యంలో భద్రతా బలగాలకు సింహస్వప్నంగా మారిన మావోయిస్టు కీలక నేత మద్వీ హిడ్మానే ఇప్పుడు మెయిన్ టార్గెట్. ఇటీవల వరుస ఎన్‌కౌంటర్ల నుంచి అతను తృటిలో తప్పించుకున్నట్టు తెలుస్తోంది. బహుషా గాయపడి కూడా ఉండొచ్చు అంటున్నారు. హిడ్మా ఉండే ప్రాంతాన్ని బలగాలు గుర్తించాయని.. ఇక ఎన్నో రోజులు తప్పించుకోలేడని చెబుతున్నారు. ఏ క్షణంలోనైనా హిడ్మాను



సెంట్రల్ ఆర్మ్డ్ ఫోర్సెస్ చుట్టుముట్టే ఛాన్సెస్ ఉన్నాయని అంటున్నారు.

**హిడ్మా కోసం 125 గ్రామాల్లో సెర్చ్ ఆపరేషన్**

హిడ్మా బీజాపూర్ జిల్లాలోని నేషనల్ పార్క్ ఏరియాలో ఉన్నట్టు భద్రతా బలగాలకు సమాచారం ఉంది. ఆ మోస్ట్ వాంటెడ్ కోసం ఆ చుట్టుపక్కల ఉన్న 125 గ్రామాలను జల్లెడ పడుతున్నారు. థర్మల్ ఇమేజింగ్ టెక్నాలజీతో హిడ్మా ఆచూకీ గుర్తించడానికి నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌కు చెందిన టీమ్‌ను తీసుకొచ్చి అటవీ ప్రాంతంలో గాలిస్తున్నారు. హిడ్మా ఉనికిని దాదాపు గుర్తించినట్టేనని తెలుస్తోంది. హిడ్మా నేలకొరిగితే.. మావోయిస్టు ఉద్యమానికి కోలుకోలేని ఎదురు దెబ్బే అంటున్నారు.

**హిడ్మాతో మావోయిజంకు ఎండ్ కార్డ్? :** మళ్లీ మావోయిజం పుంజుకోవడం అంత ఈజీ కాకపోవచ్చు. తుపాకీ గొట్టం ద్వారానే రాజ్యాధికారం సాధ్యమని భావించే రోజులు కావు ఇవి. కుటుంబాన్ని, సమాజాన్ని వదిలేసి.. తుపాకీ రాజ్యం కోసం ఎర్రజెండా పట్టుకుని అడవుల్లో తిరిగే ఆలోచన చేసే యువతరం ఇప్పుడు లేనే లేదు. పెత్తందారులు, దొరలు దాదాపు కనుమరుగయ్యారు. ఇప్పుడంతా హైటెక్ ప్రపంచం. ఫోన్తోనే సహవాసం. ఇన్నేళ్లూ అతికష్టం మీద మావోయిజాన్ని కొనసాగిస్తూ వస్తున్నారు కానీ.. హిడ్మా లాంటి లీడర్ హతమైతే.. కేంద్ర హెూంమంత్రి అమిత్ షా చెప్పినట్టే వచ్చే ఏడాది మార్చి కల్లా మావోయిస్టులు మటాష్.



# ఆరంభం అదిరింది

## ఆటపాటలతో అలరించిన శ్రేయా ఘోషల్, కరణ్ ఔజ్లా, దిశా పటానీ

## వర్ష హెచ్చరికలను సైతం బేఖాతరు చేస్తూ భారీగా హాజరైన అభిమానులు

ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2025 సీజన్ గురువారం రాత్రి కోల్కతాలోని ఐకానిక్ ఈడెన్ గార్డెన్స్లో ప్రారంభమైంది సినీ ప్రముఖులు శ్రేయా ఘోషల్, కరణ్ ఔజ్లా, దిశా పటానీ వంటి స్టార్స్ మూడ్ సెట్ చేయడంతో ప్రారంభ వేడుక గ్రాండ్గా జరిగింది. కోల్కతాలో మెగా టోర్నమెంట్ స్టైల్గా ప్రారంభమైనందున అభిమానులు సంగీతం, వినోదం మరియు క్రికెట్ గొప్ప మిశ్రమాన్ని ఆహుతులు, ప్రేక్షకులు ఆశ్వాదించారు.. కోల్కతా నైట్ రైడర్స్ (కెకెఆర్) మరియు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సిబి) మధ్య సీజన్ ఓపెన్ మ్యాచ్లో వర్షం కురుస్తుందని వాతావరణ నివేదిక ఉన్నప్పటికీ "ఆరెంజ్ అలర్ట్" జారీ చేసినా ప్రేక్షకులు మాత్రం భారీ ఎత్తున ఈ ఆరంభ వేడుకలకు హాజరయ్యారు..

ఇండియన్ ప్రీమియర్ లీగ్ - 2025 ఆరంభ వేడుకలు అట్టహాసంగా సాగాయి. కోల్కతాలోని ప్రఖ్యాత ఈడెన్ గార్డెన్స్ మైదానంలో బాలీవుడ్ సెలబ్రిటీలు తమ ఆట, పాటలతో ప్రేక్షకులను ఉర్రూతలూగించారు.



డిఫెండింగ్ చాంపియన్ కోల్కతా నైట్ రైడర్స్(కేకేఆర్) జట్టు సహ యజమాని, బాలీవుడ్ బాద్ షా షారుఖ్ ఖాన్ మైదానంలో సందడి చేశబ్బూడు. కేకేఆర్ కెప్టెన్ అజింక్య రహానే, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) సారథి రజత్ పాటిదార్లతో కాసేపు ముచ్చటించాడు. అనంతరం వేదికపైకి వచ్చి తనదైన శైలిలో ప్రసంగించాడు. ప్రపంచవ్యాప్తంగా అత్యంత ప్రజాదరణ కలిగిన క్రికెట్ లీగ్గా వెలుగొందుతున్న ఐపీఎల్లో భాగం కావడం సంతోషంగా ఉందని షారుఖ్ హర్షం వ్యక్తం చేశాడు.

అతడు పరుగుల యంత్రమని ప్రశంసల జల్లు కురిపించాడు. విరాట్ కోహ్లీతో షారుఖ్ ఖాన్ సరదాగా మాట్లాడాడు. ఆ తర్వాత కోల్ కతా నైట్ రైడర్స్ జట్టు సంచలన ఆటగాడు రింకు సింగ్ ను వేదిక మీదికి పిలిచాడు.." విరాట్ కోహ్లీ అద్భుతంగా ఆడుతున్నాడు. రోహిత్ శర్మ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అటువంటి ఆటగాళ్లకు మీరు పోటీ ఇస్తారా" అని రింకూ సింగ్ ను షారుక్ ఖాన్ ప్రశ్నించాడు.." నేను ఈ తరం ఆటగాడిని. వారు ఎప్పుడు పాత తరం ఆటగాళ్లు కాదు. వారిని చూసి ప్రతి సందర్భంలో స్ఫూర్తి పొందుతూనే ఉంటానని"రింకూ సింగ్ బదులిచ్చాడు. ఇక రింకు సింగ్ తో కలిసి షారుక్ ఖాన్ డాన్స్ వేశాడు. వారిద్దరిని చూసి విరాట్ కోహ్లీ పడి పడి నవ్వాడు. ఆ తర్వాత విరాట్ కోహ్లీ కూడా షారుక్ ఖాన్ తో కలిసి డాన్స్ వేశాడు. ఇక బిసిసిఐ పెద్దలతో పాటు ప్రారంభ వేడుకల్లో పాల్గొన్న వివిధ సెలబ్రిటీలను షారుక్ ఖాన్ వేదిక మీద ఆహ్వానించారు..కోల్ కతా నైట్ రైడర్స్ జట్టు కెప్టెన్ అజింక్య రహానే, రాయల్ చాలెంజర్స్ జట్టు కెప్టెన్ రజత్ పాటిదర్ ట్రోఫీని వేదిక మీద తీసుకొచ్చారు అనంతరం బీసీసీఐ అధ్యక్షుడు రోజర్ బిన్నీతో పాటు ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కార్యదర్శి దేవజిత్ సైకియా, ఐపీఎల్ చైర్మన్ అరుణ్ ధుమాల్లను వేదిక మీదకు ఆహ్వానించగా... ఐపీఎల్-18 కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. . . ఒకరికి ఒకరు తినిపించుకున్నారు తద్వారా ఐపీఎల్ 2025 సీజన్ ను ఘనంగా ప్రారంభించినట్టు సంకేతాలు ఇచ్చారు. చివరికి జాతీయ గీతంతో ప్రారంభం వేడుకలను ముగించారు.ఇక, ఐపీఎల్ ఆరంభ వేడుకలు ఆదివారం కూడా కొనసాగబోతున్నాయి. ఆదివారం చెన్నైలోని చిదంబరం స్టేడియంలో చెన్నై సూపర్ కింగ్స్, ముంబై ఇండియన్స్ జట్ల మధ్య మ్యాచ్ జరగబోతోంది. రాత్రి 7:30 గంటలకు చెన్నైలో ఈ మ్యాచ్ ప్రారంభం కాబోతోంది. అంతకంటే ముందు సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుధ్ ప్రదర్శన చెన్నై అభిమానులను అలరించబోతోంది. ఆదివారం సాయంత్రం 6:30 గంటలకు చిదంబరం స్టేడియంలో అనిరుధ్ ప్రదర్శన ఉంటుంది.







ఆ తర్వాత ప్రముఖ సింగర్ శ్రేయా ఘోషల్ తన గాత్రంతో ప్రేక్షకులను సమ్మోహనపరిచింది. హిందీ పాటలతో పాటు పుష్ప-2 సినిమాలోని పాపులర్ సాంగ్ .."సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామీ".. తెలుగులో పాడటం విశేషం.ఆ తర్వాత స్టార్ హీరోయిన్ దిశా పటానీ హుషారైన స్టెప్పులతో అభిమానులను ఉర్రూతలూ గించింది.

### షారుక్ ఖాన్ హోస్ట్ గా..

ఈ వేడుకలకు షారుఖ్ ఖాన్ హోస్ట్ గా వ్యవహరించాడు. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఆటగాడు విరాట్ కోహ్లీ ని వేదిక మీదికి ఆహ్వానించాడు.. 18 సీజన్లుగా విరాట్ కోహ్లీ ఆడుతున్నాడని.. అతడు గొప్ప ఆటగాడని.. అతడు ఇలాంటి ఇన్నింగ్స్ మరిన్ని ఆడాలని ఆకాంక్షించాడు.















సూర్య
suryachitramagazine@gmail.com
విజయవాడ
ఆదివారం
23 మార్చి 2025
8
సూర్య సినిమా

# 'ఓదెల 2'లో భైరవి పాత్ర చేయడం నా అదృష్టం- తమన్నా భాటియా



తమన్నా భాటియా హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'ఓదెల 2'లో నెవర్ బిఫోర్ క్యారెక్టర్ లో అలరించడానికి సిద్ధంగా వున్నారు. సూపర్ నాచురల్ థ్రిల్లర్ 'ఓదెల రైల్వే స్టేషన్'కి సీక్వెల్ ఇది. అశోక్ తేజ దర్శకత్వంలో, మధు క్రియేషన్స్, సంపత్ నంది టీమ్‌వర్క్స్‌పై డి మధు నిర్మించిన ఈ చిత్రం ప్రతి అప్‌డేట్‌తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. తమన్నా నాగ సాధువుగా, మిస్టరీ ఎనర్జీతో కూడిన పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమా టీజర్ అంచనాలని నెక్స్‌ట్ లెవెల్ కి తీసుకెళ్ళింది. రిలీజ్ డేట్ పోస్టర్ తమన్నాను ఊహించని లుక్‌లో ప్రజెంట్ చేసింది. ఆభరణాలతో సాంప్రదాయ దుస్తులలో ధరించి, ఆమె ఒక సాధారణ మహిళగా కనిపిస్తునే ఇంటెన్స్ ఎక్స్ ప్రెషన్, గాయం గుర్తులు క్యారెక్టర్ పై చాలా క్యూరియాసిటీని పెంచాయి. వారణాసి నేపథ్యం మిస్టీరియస్ లేయర్ ని యాడ్ చేస్తున్నాయి. హెబా పటేల్, వశిష్ట ఎన్ సింహ ఈ చిత్రంలో ముఖ్యమైన పాత్రలు పోషిస్తున్నారు. థ్రిల్లింగ్ యాక్షన్‌ను కథలలో అద్భుతంగా బ్లెండ్ చేయడంలో పేరుతెచ్చుకున్న సంపత్ నంది ఓదెల 2ని పర్యవేక్షిస్తున్నారు. ఈ చిత్రానికి కాంతర ఫేం అజనీష్ లోక్‌నాథ్ సంగీతం సమకూర్చారు. సౌందరరాజన్ ఎస్ సినిమాటోగ్రఫీ నిర్వర్తించగా, రాజీవ్ నాయర్ ఆర్ట్ డైరెక్టర్. అద్భుతమైన టెక్నికల్ టీంతో ఓదెల 2 ఒక మరపురాని సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ అందించబోతోంది.

ఈ వేసవిలో బిగ్గెస్ట్ ఎట్రాక్షన్ లలో ఒకటిగా ఏప్రిల్ 17న సినిమా ఓదెల2 థియేటర్స్ లో విడుదల కానుంది. హారర్, థ్రిల్లర్ చిత్రాలకు అన్ని వర్గాల ప్రేక్షకులలో ప్రత్యేక ఆసక్తి ఉంటుంది. నాగ సాధువుగా తమన్నా భాటియా శక్తివంతమైన పాత్రలో కనిపించనున్న ఓదెల 2 కథనం, సాంకేతిక అంశాల పరంగా ఇంతకు ముందు ఎప్పుడూ చూడని గ్రేట్ సినిమాటిక్ ఎక్స్ పీరియన్స్ ని అందించనుంది. హీరోయిన్ తమన్నా భాటియా మాట్లాడుతూ.. ఓదెల సినిమాని డైరెక్టర్ అశోక్ చాలా అద్భుతంగా తీశారు. ఆ సినిమా చూసినప్పుడే దానికి పార్ట్ 2 ఉండాలని భావించాను. సంపత్ నంది పార్ట్-2 ఐడియా చెప్పినప్పుడు ఎక్సైటింగ్ గా అనిపించింది. ఇది ఈజీ జోనర్ కాదు. ఒక పల్లెటూరి కథని ఇంత ఎక్సైటింగ్ గా థ్రిల్లింగ్ గా చెప్పడం మామూలు విషయం కాదు. డైరెక్టర్ అశోక్ సినిమాని నెక్స్ట్ లెవెల్ లో తీశారు. నేను ఏ సినిమా చేసిన ఆడియన్స్ కి ఒక కొత్త ఎక్స్పీరియన్స్ ఉండాలని కోరుకుంటాను. అలాంటి కొత్త ఎక్స్పీరియన్స్‌ని ఇచ్చే సినిమా ఇది. భైరవి క్యారెక్టర్ చేయడం యాక్టర్‌గా అదృష్టంగా భావిస్తున్నాను. నా కెరీర్ లో హైయెస్ట్ ఐషాట్ క్లోజప్స్ ఉన్న సినిమా ఇదే. భైరవి క్యారెక్టర్‌ని బీలవబుల్, నేచురల్, మ్యాజికల్ గా చూపించడం నిజంగా బిగ్ ఛాలెంజ్. మధు గారు సినిమాని చాలా గ్రాండ్‌గా నిర్మించారు. ఇది గ్రేట్ థియేట్రికల్ ఎక్స్పీరియన్స్ ఉండే సినిమా. తప్పకుండా అందరికీ గ్రేట్ బిగ్ స్క్రీన్ ఎక్స్పీరియన్స్ ఇస్తుంది'అన్నారు. యస్ జె సూర్య మాట్లాడుతూ.. అందరికీ నమస్కారం. వీర ధీర శూర ప్రమోషన్ కోసం ఇక్కడికి రావడం చాలా ఆనందంగా ఉంది. సినిమా ట్రైలర్ టీజర్ కి చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది. మంచి కంటెంట్ ఎక్కడున్నా సరే తెలుగు ప్రేక్షకులు గొప్పగా ఆదరిస్తున్నారు. హాలీవుడ్ డైరెక్టర్ మార్టిన్ స్కోర్సెస్ అంటే డైరెక్టర్ అరుణ్ గారికి చాలా పిచ్చి. ఒకవేళ మార్టిన్ స్కోర్సెస్ రాజమండ్రిలో సినిమా చేస్తే ఎలా ఉంటుందో ఈ సినిమా అలా ఉంటుంది. రంగస్థలం లాంటి రా అండ్ రస్టిక్ సినిమా ఇది. ఇక్కడ స్పైడర్ సినిమా చేశాను. అలాగే చాలా సినిమాలు డబ్బింగ్ రూపంలో వచ్చాయి. అన్ని పాత్రలకి మంచి రెస్పాన్స్ వచ్చింది. నాని గారితో చేసిన సరిపోదా శనివారం సినిమాకి ఆడియన్స్ నుంచి చాలా అద్భుతమైనటువంటి స్పందన వచ్చింది. ఖుషి సినిమాతో డైరెక్టర్ గా ఎంత మంచి స్థాయి దొరికిందో యాక్టర్ గా సరిపోదా శనివారంతో అలాంటి ఆదరణ తెలుగులో లభించింది. వీరధీరలో నా క్యారెక్టర్ పెర్ఫార్మెన్స్ చాలా కొత్తగా ఉంటుంది. అరుణ్ చాలా టాలెంటెడ్ డైరెక్టర్. ఈ సినిమాలో 16 మినిట్స్ డ్యూరేషన్ గల ఒక సింగిల్ షాట్ ఉంది. ఆ షాట్ కోసం చాలా రిహార్సల్స్ చేశారు. ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా ఒక రాత్రంతా ఆ షాట్ తీస్తూనే ఉన్నాం. ఆ షాట్ గురించి చెప్తుంటే గూజ్ బంప్స్ వస్తున్నాయి. నిజంగా మీరు థియేటర్స్ లో చూడాల్సిందే. మీలానే నేను విక్రమ్‌కి అభిమానిని. విక్రమ్ గారు లాంటి యాక్టర్ ఉండడం మన సౌత్ ఇండస్ట్రీకి గర్వకారణం.

## "28°C" టెంపరేచర్ ఫీల్ ప్రేక్షకులకి ఎక్కుతుందా?




"పొలిమేర" చిత్రం విజయంతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్. ఆయన దర్శకత్వం వహించిన మొదటి సినిమా "28°C" ఈ నెల 28న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఎమోషనల్‌గా సాగే అద్భుతమైన ప్రేమ కథతో తెరకెక్కిన ఈ చిత్రంలో నవీన్ చంద్ర హీరోగా నటించగా..షాలినీ వడ్నికట్టి హీరోయిన్ గా కనిపించనుంది. "28°C" చిత్రాన్ని వీరాంజనేయ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ప్రొడ్యూసర్ సాయి అభిషేక్ నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి 'చెలియా చెలియా..' లిరికల్ సాంగ్ రిలీజ్ చేశారు. 'చెలియా చెలియా..' లిరికల్ సాంగ్‌ను మ్యూజిక్ డైరెక్టర్ శ్రావణ్ భరద్వాజ్ కంపోజ్ చేయగా...కిట్టు విస్సాప్రగడ లిరిక్స్ అందించారు. సింగర్ రేవంత్ ఈ పాటను ఆలపించారు. 'చెలియా చెలియా..' పాట ఎలా ఉందో చూస్తే – 'నీ నగుమోము కనులారా, చూస్తుంటే క్షణమైనా, కనురెప్ప వాలేనా, నా కనుసైగ నీ వెనకా, వెంటాడే మౌనంగా, వేచిందే నువు రాక, ఊహలలో ఊరిస్తూ, దాగినది చాలుగా, ఊరటగా నా ఎదురు నా జతగా రా, చెలియా చెలియా నిన్ను చూడంగ, చెలియా చెలియా కనులు చాలవుగా..' అంటూ లవ్ ఫీల్ తో సాగుతుందీ పాట. మనసును తాకే భావోద్వేగాలతో ఆద్యంతం సాగే ప్రేమ కథా మూవీ ఇదని చిత్ర దర్శకుడు డా. అనిల్ విశ్వనాథ్ తెలిపారు.

## ఎమోషనల్ మూవీ 'నాన్నా మళ్లీ రావా..!'

తెలుగులో మరో హార్ట్ టచింగ్ మూవీ రాబోతోంది. కమల్ క్రియేషన్స్ బ్యానర్‌పై నిర్దేష్ దర్శకత్వంలో, డా. ఉమారావు నిర్మాణంలో సత్యప్రకాష్ ప్రధాన పాత్రలో నటిస్తున్న మూవీ 'నాన్నా మళ్లీ రావా..!'. సత్యప్రకాష్, ప్రభావతి, రిత్విక్, హారిక, శిరీష తదితరులు నటించిన ఈ మూవీ ప్రివ్యూ షో హైదరాబాద్ రామానాయుడు స్టూడియోలో ప్రదర్శించారు. 'నాన్నా మళ్లీ రావా..!' ప్రివ్యూ వీక్షించిన అనంతరం పలువురు భావోద్వేగానికి గురయ్యారు. సినిమా చూస్తున్న సమయంలో కన్నీళ్లు ఆగలేదని చెప్పారు. ఈ సందర్భంగా ప్రధాన పాత్రలో నటించిన సీనియర్ నటుడు సత్యప్రకాష్ మాట్లాడుతూ.. "ఈ సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు గ్లిజరిన్ పెట్టుకోకుండానే ప్రతి రోజు తనకు కన్నీళ్లు వచ్చాయి. సినిమా షూటింగ్ అని కాకుండా తనకు జరుగుతున్న నిజ సందర్భాల్లాగే తాను ఫీల య్యాను, దీనికి కారణం దర్శ కుడు నిర్దేష్ కథ, స్క్రీన్ ప్లే, దర్శకత్వం కార ణం. ఇలాంటి సినిమాలు అరు దుగా వస్తాయి, కుటుంబ సమే తంగా చూడగలిగే దర్శకుడు తీర్చిదిద్దారు" అని తెలిపారు.







# ప్రభాస్‌కి అన్నయ్యగానా...?

పాన్ ఇండియాలో ప్రభాస్ ఎంత పెద్ద స్టార్ అన్నది చెప్పాల్సిన పనిలేదు. అతడి కటౌట్ కూడా అలాంటిదే. అందుకే ఇండియాలో ఎంత మంది స్టార్లు ఉన్నా? ప్రభాస్ మాత్రం ఎప్పటికీ ప్రత్యేకమే. అతడు పాన్ ఇండియాకి కనెక్ట్ అవ్వడానికి కూడా ప్రధాన కారణం ఆ కాటౌట్ కూడా ఒకటి. సాహో చిత్రం సౌత్‌లో ఫెయిలైనా నార్త్ మార్కెట్ లో మాత్రం సంచలన వసూళ్లు రాబట్టినప్పుడు మరోసారి డార్లింగ్ స్టామినా ఏంటన్నది అర్దమైంది. అటుపై సలార్, కల్కి 2898 లాంటి బ్లాక్ బస్టర్లతో మరింత స్ట్రాంగ్ అయ్యాడు. ఇప్పుడా భారీ కటౌట్ తో సంచలన డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా స్పిరిట్ చిత్రానికి రంగం సిద్దం చేస్తోన్న సంగతి తెలిసిందే. ఇందులో ప్రభాస్ కాఫ్‌గా కనిపించనున్నాడు. సందీప్ మార్క్ యాక్షన్ థ్రిల్లర్ ఇది. ఇందులో నెక్స్ట్ లెవల్ యాక్షన్ ఉంటుందని ఇప్పటికే హింట్ కూడా ఇచ్చేసాడు. మరి అలాంటి కంటెంట్ లో సంజయ్ దత్ కూడా భాగమైతే ఎలా ఉంటుంది? అందులోనూ ప్రభాస్ కి అన్నయ్య పాత్రలో ఖల్ నాయక్ కనిపిస్తే ఇంకెలా ఉంటుంది? వెండి తెరపై అది అద్భుతమే కదా. ఇప్పుడా ఛాన్స్ తీసుకోవడానికి సందీప్ రెడ్డి వంగా సిద్ధంగా ఉన్నట్లు సన్నిహితుల సమాచారం. ప్రభాస్‌కి అన్నయ్య పాత్రలో సంజయ్ దత్ పేరు పరిశీలనలో ఉన్నట్లు తెలిసింది. ప్రభాస్ వయసు.. కటౌట్ ఆధారంగా సంజయ్ దత్ అయితే పక్కాగా సరితూగుతాడని సందీప్ భావిస్తున్నాడుట. దీనిపై పూర్తి సమాచారం తెలియాల్సి ఉంది. ఇప్పటికే సంజయ్ దత్ సౌత్ సినిమాల్లో నటించడం మొదలు పెట్టిన సంగతి తెలిసిందే.

## L2E: ఎంపురాన్ అన్ని రకాల అంశాలతో అలరించేలా ఉంటుంది-మోహన్‌లాల్

మలయాళ సూపర్‌స్టార్, కంప్లీట్ యాక్టర్ మోహన్‌లాల్, పృథ్వీరాజ్ సుకుమారన్ కాంబోలో తెరకెక్కిన భారీ చిత్రం 'L2E: ఎంపురాన్'. చిత్రాన్ని ఆశీర్వాద్ సినిమాస్, శ్రీ గోకులం మూవీస్ బ్యానర్లపై ఆంటోనీ పెరుంబవూర్, గోకులం గోపాలన్ నిర్మించారు. మురళీ గోపి కథను అందించారు. ఈ మూవీ ప్రపంచ వ్యాప్తంగా మార్చి 27న మలయాళంతో పాటు తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ అవుతుంది. ఈ క్రమంలో శనివారం నాడు చిత్ర యూనిట్ ప్రెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా



సూపర్‌స్టార్, కంప్లీట్ యాక్టర్ మోహన్‌లాల్ మాట్లాడుతూ .. 'మా సినిమాను తెలుగులో రిలీజ్ చేస్తున్న దిల్ రాజు గారికి థాంక్స్. 47 ఏళ్లుగా ఈ సినీ ఇండస్ట్రీలో నా ప్రయాణంలో తెలుగు చిత్ర సీమతో ఎంతో అనుబంధం ఉంది. అక్కినేని నాగేశ్వరరావు గారితో నటించే అదృష్టం నాకు కలిగింది. తెలుగు ప్రేక్షకులు చూపించే ప్రేమ ఇంకెక్కడా దొరకదు. ఇండియాలోనే టాలీవుడ్ ది బెస్ట్ ఇండస్ట్రీగా ఉంది. కేరళలో మేం అన్ని భాషల చిత్రాలను చూస్తాం. ఇప్పుడు మా సినిమాల్ని కూడా అన్ని భాషల వాళ్లు చూస్తున్నారు. ఇప్పుడు మేం పాన్ ఇండియా వైడ్‌గా చిత్రాలను చేస్తున్నాం. సినీ లవర్స్ అందరి కోసం మేం మూవీస్ తీస్తున్నాం. పృథ్వీరాజ్ ఈ చిత్రంతో తెరపై అద్భుతం చేశారు. మేం ముందుగా లూసిఫర్‌ను మూడు పార్టులుగా తీయాలని అనుకున్నాం. ఎంపురాన్ బ్లాక్ బస్టర్ అయితే.. మూడో పార్ట్‌తో మళ్లీ వస్తాం. రెండేళ్లుగా ఈ మూవీ కోసం చాలా కష్టపడ్డాం. సుజిత్ కెమెరా వర్క్ అద్భుతంగా ఉంటుంది. పాలిటిక్స్, యాక్షన్, ఎమోషన్స్, ఎంటర్‌టైన్మెంట్ ఇలా అన్ని రకాల అంశాలు ఈ చిత్రంలో ఉంటాయి. అందరినీ అలరించేలా మా సినిమా ఉంటుంది. మార్చి 27న మా చిత్రం రాబోతోంది. అందరూ చూడండి' అని అన్నారు.

## అమెరికా తెలుగు సంఘం (నాట్స్) "8వ కర్టెన్ రైజర్

ఉత్తర అమెరికా తెలుగు సంఘం (నాట్స్) 8వ తెలుగు సంబరాలు ఈవెంట్‌కు సిద్ధమవుతోంది. జూలై 4వ తేదీ నుంచి 6వ తేదీ వరకు ఈ ఉత్సవాలు అమెరికాలోని టంపాలో జరగనున్నాయి. తాజాగా హైదరాబాద్‌లో నాట్స్ 8వ తెలుగు సంబరాలు కార్యక్రమ కర్టెన్ రైజర్ ఈవెంట్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలుగు సంబరాలు కాన్ఫరెన్స్ కన్వీనర్ అండ్ పూర్వపు చైర్మన్ శ్రీనివాస్ గుత్తికొండ, నాట్స్ చైర్మన్ ప్రశాంత్ పిన్నమనేనిలు అమెరికా నుండి విచ్చేసి మీడియా సమావేశం నిర్వహించారు. నటి



జయసుధ, ఆమని, దర్శకులు హరీశ్ శంకర్, మెహర్ రమేష్, సంగీత దర్శకుడు తమన్, గీత రచయితలు రామజోగయ్య శాస్త్రి, చంద్రబోస్, కళ్యాణ్ చక్రవర్తి, తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాట్స్ ఛైర్మన్ ప్రశాంత్ పిన్నమనేని మాట్లాడుతూ – నాట్స్ అంటే సేవ, భాష ..ఈ రెండు పదాలు గుర్తుకువస్తాయి. అమెరికాలోని తెలుగు వారికి అండగా నిలబడేందుకు 2009లో ఈ ఆర్గనైజేషన్ ను స్థాపించాం. మనకు ఇక్కడ ఏదైనా ఆపద వస్తే స్నేహితులు, బంధువులు ఉంటారు. కానీ అమెరికాలో ఉన్న తెలుగువారికి ఎవరూ ఉండరు. వారికి ధైర్యాన్ని ఇస్తూ అండగా నిలబడుతోంది నాట్స్. తెలుగువారు ఎక్కడున్నా వారికి నాట్స్ అండగా ఉంటోంది. నాట్స్ అంటే ఒక ధైర్యం, ఒక నమ్మకం. మన భాష రేపటి తరాలకు అందాలి, వారు మన భాషను తెలుసుకోవాలి. అలాగే ఆపద వస్తే ఆదుకునేందుకు చేయూత ఇవ్వాలి..ఇలాంటి లక్ష్యాలతో నాట్స్ ను కొనసాగిస్తున్నాం. మా సంస్థ 8వ తెలుగు సంబరాలు కార్యక్రమం జరుపుకోవడం సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమంలో పలువురు తెలుగు కవులు, కళాకారులు, నటీనటులు, ఇతర రంగాల ప్రముఖు హాజరుకాబోతున్నారు.

## డిఫరెంట్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ 'వీర ధీర శూర' : విక్రమ్



చియాన్ విక్రమ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్-ప్యాక్డ్ మూవీ వీర ధీర సూరన్. సక్సెస్ ఫుల్ డైరెక్టర్ ఎస్.యు. అరుణ్ కుమార్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో ఎస్.జె. సూర్య, సూరజ్ వెంజరా ముడు, దుషార విజయన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. హెచ్.ఆర్. పిక్చర్స్ రియా శిబు నిర్మించిన ఈ చిత్రం ఒక యాక్షన్ థ్రిల్లర్, ఇప్పటికే రీలీజైన ప్రమోషనల్ కంటెంట్ కి ట్రెమండస రెస్పాన్స్ వచ్చింది. ఎన్.వి.ఆర్ సినిమా తెలుగు రైట్స్‌ని సొంతం చేసుకోగా, నైజాం రిలీజ్ మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా జరుగుతుంది. మార్చి 27న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్‌మీట్ నిర్వహించారు. హీరో విక్రమ్ మాట్లాడుతూ... మాస్ సినిమాలు చేస్తున్నాను కానీ రస్టిక్ గా ఉండే సినిమా చేసి చాలా రోజులైంది. ఫ్యాన్స్ కోసం మంచి రస్టిక్ యాక్షన్ ఉన్న ఒక సినిమా చేయాలని నేను డైరెక్టర్ అరుణ్ అనుకున్నాం. యాక్షన్ తో పాటు మంచి ఎమోషన్ ఉన్న సినిమా ఇది. ఇలాంటి సినిమాలు చేయడానికి మంచి పెర్ఫార్మర్స్ కావాలి. ఈ సినిమా కోసం మేము ఫస్ట్ అప్రోచ్ అయిన యాక్టర్ సూర్య. ఆయన ఇందులో క్యారెక్టర్ చేయడం నాకు చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ క్యారెక్టర్‌కి సూర్య అయితేనే పర్ఫెక్ట్ . నేను ఎస్ జె సూర్య సినిమాలకి బిగ్ ఫ్యాన్‌ని. యాక్టర్‌గా ఆయన చాలా అద్భుతమైన పాత్రలు చేస్తున్నారు. ఒక పాత్రతో మరో పాత్రకి చాలా వైరుధ్యం ఉంటుంది. యాక్టర్‌గా ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. ఈ సినిమాలో సూర్యతో కలసి యాక్ట్ చేయడం వండర్‌ఫుల్ వార్నింగ్ పాయింట్ అవుతుంది. ప్రసాద్ లక్కీ హ్యాండ్. ఆయన మా సినిమాని రిలీజ్ చేయడం చాలా ఆనందంగా ఉంది. ఇది డిఫరెంట్ మాస్ కమర్షియల్ ఎంటర్‌టైనర్ . డైరెక్టర్ అరుణ్‌ఈ సినిమాని చాలా అద్భుతంగా తీశాడు. ఒక ఆడియన్స్ ఇలాంటి సినిమాని చూడడానికి ఇష్టపడతాను. జీవి ప్రకాష్ కుమార్ వండర్ఫుల్ మ్యూజిక్ ఇచ్చారు. ప్రొడ్యూసర్స్ ఎక్కడ కాంప్రమైజ్ కాకుండా ఈ సినిమాని గ్రాండ్ గా నర్మించారు. తెలుగులో అన్ని రకాల సినిమాలు అద్భుతమైనటువంటి విజయాన్ని సాధిస్తున్నాయి. యాక్టర్స్ కి ఇది చాలా గొప్ప అవకాశం. అన్ని రకాల పాత్రలు చేసే ఛాన్స్ ఉంటుంది . తెలుగు ఆడియన్స్ చూపిస్తున్న ప్రేమ అద్భుతం. వారి ప్రేమకి నా కృతజ్ఞతలు. మార్చి 27న ఈ సినిమా వస్తోంది. ఇది అందరూ ఎంజాయ్ చేసే సినిమా కచ్చితంగా మీరంతా ఎంజాయ్ చేస్తారని నమ్ముతున్నాను. ఈ సినిమా ఫస్ట్ షాట్ నుంచే కథ మొదలైపోతుంది. అందుచేత ఒక ఫైవ్ మినిట్స్ ముందే థియేటర్‌లో వుండేలా చూసుకోవాలని ప్రేక్షకులుని కోరుతున్నాను'అన్నారు.

## "సంతాన ప్రాప్తిరస్తు" లిరికల్ సాంగ్

విక్రాంత్, చాందినీ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "సంతాన ప్రాప్తిరస్తు". ఈ సినిమాను మధుర ఎంటర్ టైన్ మెంట్, నిర్వి ఆర్ట్స్ బ్యానర్స్ పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మిస్తున్నారు. అల్లు శిరీష్ హీరోగా "ఏబీసీడీ" సినిమా, రాజ్ తరుణ్ తో "అహ నా పెళ్లంట" అనే వెబ్ సిరీస్ రూపొందించిన దర్శకుడు సంజీవ్ రెడ్డి ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. వెంకటాద్రి ఎక్స్ ప్రెస్, ఎక్స్ ప్రెస్ రాజా, ఏక్ మినీ కథ లాంటి చిత్రాలకు స్క్రీన్ ప్లే అందించిన రచయిత షేక్ దావూద్ జి ఈ సినిమాకు స్క్రీన్ ప్లే రాస్తున్నారు. యూత్ ఫుల్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్ గా తెరకెక్కుతున్న "సంతాన ప్రాప్తిరస్తు" సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రెడీ అవుతోంది. ఈ సినిమా మ్యూజికల్ ప్రమోషన్స్ బిగిన్ చేశారు. ఈ నెల 26వ తేదీన ఫస్ట్ సింగిల్ 'నాలో ఏదో..' రిలీజ్ చేయబోతున్నారు. సునీల్ కశ్యప్ బ్యూటిఫుల్ కంపోజిషన్ లో హీరో హీరోయిన్స్ విక్రాంత్, చాందినీ చౌదరి మధ్య వచ్చే రొమాంటిక్ సాంగ్‌గా 'నాలో ఏదో..' పాటను చిత్రీకరిం చారు. ఈ పాటకు శ్రీజో లిరిక్స్ అందిం చారు. సింగర్స్ దినకర్ కల్వల, అదితి భావరాజు పాడారు. ఇటీవల డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా రిలీజ్ చేసిన "సంతాన ప్రాప్తి రస్తు" టీజర్‌కు హ్యూజ్ రెస్పాన్స్ వచ్చింది. ఈ మూవీ సాంగ్స్ మీద కూడా మ్యూజిక్ లవర్స్‌లో మంచి ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి.



PRINTED & PUBLISHED BY NUKARAPU PADMAJA ON BEHALF OF SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. PRINTED AT SPR PRINTING PRESS, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR, NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081, TELANGANA, PUBLISHED AT SPR PUBLICATIONS PVT.LTD, SURYA SOUDHA, PLOT NO.185, M.C.H NO:258/1/185,SIDDIVINAYAKA NAGAR,NEAR AYYAPPA SOCIETY, MADHAPUR, HYDERABAD-500081. EDITOR : NUKARAPU PADMAJA. Fax No:040-30473232 RNI Registration No. APTEL/2007/22044